## బాలీవుడ్.. వివాహ వ్యవస్థను తప్పుగా చూపిస్తోంది

మిగతాది 8లో

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

## ఇదండీ..కబురు..




సంపుటి : 23 సంచిక : 72 | మంగళవారం ఫిబ్రవరి 25 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5




# నరేందర్‌రెడ్డి పట్టభద్రులకు ప్రభుత్వానికి వారధిగా ఉంటాడు

- కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చేందుకు కుట్రలు
- ఫామ్‌హౌస్‌కే కేసీఆర్ పరిమితం
- బీఆర్ఎస్ ఎవరికి ఓటు వేయాలో బహిర్గతం చేయాలి
- పోటీకి నిలపడనివారే ఎలా ప్రశ్నిస్తారు : సీఎం రేవంత్‌రెడ్డి

**కబురు న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి24:** ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి ప్రభుత్వానికి, పట్టభద్రులకు మధ్య వారధిగా ఉంటారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీని బలహీన పర్చే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరిస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌లో పడుకున్నారని.. బీఆర్ఎస్ నాయకులు ఏ అభ్యర్థికి ఓటు వేయాలని చెబుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించవద్దని ప్రచారం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి నిలబడని బీఆర్ఎస్ రాజకీయ పార్టీఏ కాదన్నారు. పోటీకి నిలబడని వారు కాంగ్రెస్‌ను ఎలా ప్రశ్నిస్తారని నిలదీశారు. తమకు పరిపాలించే అవకాశం తక్కువగా వచ్చిందని.. అయినా 55,163 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకొచ్చారు. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

02



# రేవంత్‌రెడ్డిలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటమి భయం: బండి సంజయ్

**కబురు న్యూస్,కరీంనగర్, ఫిబ్రవరి24:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయం సీఎం రేవంత్‌రెడ్డి లో కనిపిస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. సర్వేలన్నీ కాంగ్రెస్‌కు మూడో స్థానమని తేల్చేశాయని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడినా, గెలిచినా పోయేదేమీ లేదంటున్నారని.. అలాంటి ధోకా లేకుంటే ప్రచారానికి ఎందుకొచ్చినట్లని ప్రశ్నించారు. “కేసులపై మీరు విచారణ చేస్తూ మమ్మల్ని అరెస్ట్ చేయమంటారా? భారాసతో చీకటి ఒప్పందాలు చేసుకుని మాపై బురద చల్లుతారా?గత ప్రభుత్వ స్కామ్‌లు సీబీఐకి అప్పగిస్తే దోషులను జైల్లో వేస్తాం” అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# సొ‘రంగం’లోకి ర్యాట్ హోల్ మైనర్స్..

## ఉత్తరాఖండ్ సొరంగం నుంచి 41 మందిని బయటికి తెచ్చింది వీళ్లే..!

- 8 మందిని రక్షించేందుకు ఆరుగురు మైనర్ల రెస్క్యూ
- ఎండోస్కోపిక్, రోబోటిక్ కెమెరాల ద్వారా టన్నెల్ స్థితిగతులపై అంచనా

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి24:** శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ లో చిక్కుకు పోయిన వారిని రక్షించేందుకు ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ర్యాట్ హోల్ మైనర్స్ ను రంగంలోకి దించింది. 2023లో ఉత్తరాఖండ్ సిల్కియారా సొరంగంలో 41 మంది కార్మికులు చిక్కుకోగా 17రోజులు ప్రయత్నించినా అధికారులు బయటికి తీసుకురాలేకపోయారు. చివరికి ఈ ర్యాట్ హోల్ మైనర్లు ఒక్కరోజులోనే వారందరినీ సురక్షితంగా తీసుకొచ్చారు. ఎస్ఎల్ బీసీ వద్దకు చేరుకున్న



ఆరుగురు ర్యాట్ హోల్ మైనర్స్.. టన్నెల్‌లో పరిస్థితులను తెలుసుకునేందుకు ఎండోస్కోపిక్, రోబోటిక్ కెమెరాలను పంపి పరిస్థితిపై ఒక అంచనాకు వచ్చారు.



# మాజీ సీఎంపై మంత్రి కొండా సురేఖ సెటైర్

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి24:** కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీకి రాకపోవడంపై మంత్రి కొండా సురేఖ తనదైన శైలిలో సెటైర్ వేశారు. నిన్న జరిగిన భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్‌లో కోహ్లీ బద్దలు కొట్టిన రికార్డును ప్రస్తావిస్తూ మాజీ సీఎంపై మంత్రి కొండా సురేఖ పలు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రజలకు అందుబాటులో లేకపోవడం పెద్ద రికార్డే కదా అంటూ సెటైర్ వేశారు.

2లో..

# మళ్లీ గట్టు దాటి.. తీన్మార్ మల్లన్న హాట్ కామెంట్స్



**కబురు న్యూస్,కరీంనగర్, ఫిబ్రవరి24:** అధికార కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న రగడ కొనసాగుతోంది. ఒకవైపు నవీన్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలనే గొంతుకలు పెరుగుతున్న వేళ.. ఆయన మరింత రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ షోకాజ్ నోటీసులు ఇచ్చినా కూడా తగ్గేదేలే అంటున్నారు. తాజాగా..ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో కాంగ్రెస్‌ది, తనది వేర్వేరు దారన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల బృందంతో ఇవాళ కరీంనగర్‌లో సభకు హాజరవుతున్నారు.

మిగతాద్ది 2 లో



# బీఆర్ఎస్ నేతలకు కనీస మానవత్వం లేదు

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి24:**

- ఎస్ఎల్‌బీసీ ప్రమాద స్థలాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించి సహాయ చర్యలు పర్యవేక్షించారు.
- తూప్రాన్ రైలు ప్రమాదంలో స్కూల్ విద్యార్థులు చనిపోతే కేసీఆర్ పరామర్శ చేయలేదని విమర్శించారు.
- సొరంగంలో చిక్కుకున్న 8 మందిని క్షేమంగా బయటకు తీసుకురావాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.
- ఇలాంటి ప్రమాదాల సమయంలో రాజకీయాలు విసరేసి, అందరూ కలిసినట్లుగా సహాయం చేయాలని సూచించారు.

మిగతాది 2లో



# కెసిఆర్ ఇంటర్‌నెట్ సెంటర్ ఏర్పాటు

- మానుకోట జిల్లాలో ఎమ్మెల్సీ కవిత ప్రారంభం

మహబూబాబాద్, **కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి24:** మాజీ సీఎం కేసీఆర్ వీరాభిమాని, దివ్యాంగుడైన చిర్రా సతీశ్ జిరాక్స్ సెంటర్‌ను ఎమ్మెల్సీ కవిత సోమవారం ప్రారంభించారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగుడైన సతీశ్‌కు ఆర్థికంగా చేయూతనందించిన కవిత.. నేడు ‘కేసీఆర్’ ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్‌ను ఆరంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ రవీందర్ రావు, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్, మాజీ ఎంపీ

# మానసిక క్షోభలో రాష్ట్ర ఉద్యోగులు



- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేని దుస్థితి
- ఫీజు రియంబర్స్‌మెంట్‌లో పూర్తి వివక్ష
- 14నెలల మీ పాలనలో ఏ వర్గం సంతృప్తిగా లేదు
- ఇదంతా వదిలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారు
- సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిని కిషన్ రెడ్డి

2లో..

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి24:** రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేయడం ఎంతవరకు న్యాయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణలో 14 నెలల కాంగ్రెస్ పాలన అసంతృప్తిగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువత, పెన్షనర్లు, కళాశాలల యాజమాన్యాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, నిర్లక్ష్య ధోరణిపట్ల భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. 14నెలల మీ పాలనలో ఆయా వర్గాలేవీ సంతృప్తిగా లేరనేది నిస్సందేహమని, ఎన్నికల్లో వారికి ఇచ్చిన హామీలను సైతం మీరు ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నారంటూ ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.

# 43 శైవక్షేత్రాలకు 3,000 ప్రత్యేక బస్సులు




2లో..

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి24:** మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు వెళ్లేందుకు 43 శైవక్షేత్రాలకు 3,000 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది.



2లో..

# మూడు రోజులపాటు మద్యం దుకాణాలు బంద్

**కబురు న్యూస్,హైదరాబాద్,ఫిబ్రవరి24:** రాష్ట్రంలోని ఏడు ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. ఆయా ప్రాంతాల్లో అభ్యర్థులు ప్రచారాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈనెల 27న తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలు జరిగే తేదీతో పాటు మరో రెండు రోజుల పాటు మద్యం దుకాణాలను మూసివేయాలని సర్కార్ నిర్ణయించింది. ఈనెల 25 నుంచి 27 వరకు వైన్ షాప్స్ క్లోజ్ అవుతాయని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటించారు. ఫిబ్రవరి 25న సాయంత్రం 4 గంటల నుంచి 27 సాయంత్రం 4 గంటల వరకు మద్యం దుకాణాలను బంద్ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# సంపాదకీయం

## వాక్కాలుష్యం

మాటల గురించి చెప్పడమంటే, మాటలు కాదుగాని, మాటల గురించి కాస్త మాట్లాడుకుందాం. మాటలు రకరకాలు. ఇతరుల మనసులను గాయపరచే ఈటెల్లాంటి మాటలుబీ గాయపడ్డ మనసులకు ఊరటనిచ్చే ఊరడింపు మాటలుబీ ఎదుటివారిని మునగ చెట్టెక్కించే మెరమెచ్చు మాటలుబీ జనాలను ఇట్టే బోల్తా కొట్టించే బురిడీ మాటలుబీ సొంత డప్పు మోగించుకోవడంలో కోటలు దాటే మాటలుబీ కపటబుద్ధులాడే కల్లబొల్లి మాటలుబీ బుద్ధిహీనుల పొల్లు మాటలుబీ ఈర్ష్యాళువుల ద్వేషపు మాటలుబీ ఉబుసుపోవడానికి చెప్పుకొనే ఊకదంపుడు మాటలు%–% మాటల గురించి చెప్పుకోవాలంటే, ఇలా ఎన్ని మాటలైనా ఉంటాయి. మాటలాడే తీరును బట్టి మనిషిని అంచనా వేయవచ్చు. ఎంతటి స్ఫురద్రూపులైనా కావచ్చుబీ మరెంతటి నానాలంకారభూషితులైనా కావచ్చుబీ భాషణ నైపుణ్యం కొరవడితే మాత్రం ఎన్ని ఆభరణాలను దిగేసుకున్నా, ఎన్ని అలంకారాలు చేసుకున్నా, ఎవరూ పట్టించుకోరు. 'కేయూరాణి న భూషయంతి పురుషం హారాః న చంద్రోజ్జ్వలాః/ న స్నానం న విలేపనం న కుసుమం నాలంకృతా మూర్ధజాః/ వాణ్యేకా సమలంకరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే/ క్షీయంతేఖిల భూషణాని సతతం వాగ్భూషణం భూషణం' అన్నాడు భర్తృహరి. ఇదే శ్లోకాన్ని ఏనుగు లక్ష్మణకవి 'భూషలు గావు మర్త్యులకు భూరిమయాంగద తార హారముల్/ భూషిత కేశ పాశ మృదు పుష్ప సుగంధ జలాభిషేకముల్/ భూషలు గావు పురుషుని భూషితు జేయు పవిత్రవాణి వా/గ్భూషణమే సుభూషణము భూషణముల్ నశియించునన్నియున్' అని తెలుగులోకి అనువదించాడు. మనకు 'వేషభాషలు' అనే పదబంధం ఉంది. వేషం ఒక్కటే చాలదు, అందుకు తగిన భాష కూడా ఉన్నప్పుడే రాణిస్తుంది. దర్పానికి చిహ్నమైన భుజకీర్తులు, మెడలో ధగధగలాడే సువర్ణహారాలు, కేశపాశాలకు సొగసైన అలంకారాలు, శరీరాన్ని ఘుమఘుమలాడించే పన్నీటి స్నానాలు, ఒంటికి పూసుకునే మైపూతలు %–% ఇవేవీ మనిషికి అలంకారాలు కాలేవు. సంస్కారభరితమైన, సందర్భోచితమైన మృదువాక్కులే మనిషికి అసలైన ఆభరణాలు. భర్తృహరి సారాంశం ఇదే! అసమాన పదసంపద, అనర్గళ వక్తృత్వ ప్రాభవం, అన్నింటికీ మించి బహిరంగ వేదికలపై వాక్కుకు తగిన అభినయ చాతుర్యం వంటి ప్రతిభా పాటవాలెన్ని ఉన్నా, కించిత్ సందర్భశుద్ధి కూడా ఉండాలి. అప్పుడు మాత్రమే వాగ్భూషణం మిలమిలలాడుతుంది. సమయ సందర్భాలను పట్టించుకోకుండా, నోటికొచ్చినట్లు మాట్లాడితే సభలలో రసాభాస తప్పదు. పద్మభూషణ పద్మవిభూష్యణాది సగౌరవ భూషణాలు ఎన్ని ఉన్నా, సందర్భశుద్ధి లేని వాచాలత ప్రదర్శించినట్లయితే, సదరు మనుషుల వాగ్భూషణం వెలవెలబోతుంది. అనవసర ప్రసంగాలు, అసందర్భ ప్రలాపాలు, పరుష పదప్రయోగాలు వాగ్భూషణానికి కిలుములా పట్టి, దానిని వెలవెలబోయేలా చేస్తాయి. వాగ్భూషణం వన్నె తరగకుండా ఉండాలంటే, ఎప్పుడు మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో, ఎప్పుడు మౌనం పాటించాలో తెలుసుకోగల ఇంగితం కలిగి ఉండాలి. సూక్ష్మంగా ఈ లక్షణాన్ని వాగ్వివేకం అనవచ్చు. వాగ్వివేకం కలిగినవాళ్లు లోకంలో ఉత్తములుగా, ఉన్నతులుగా సముచిత గౌరవం పొందుతారు. 'మాట్లాడటం కన్నా మౌనంగా ఉండటమే సురక్షితం' అన్నాడు గ్రీకు తత్త్వవేత్త ఎపిక్టీటస్. మనోభావాల శకంలో ఆయన సలహా పాటించదగినదే! 'మౌనేన కలహం నాస్తి' అని మన పూర్వ సుభాషితం కూడా చెబుతోంది. అయినా, మాట్లాడక తప్పని పరిస్థితులు ఎదురైనప్పుడు ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలుసుకోవడమే వాగ్వివేకం. ఇదే సంగతిని 'అనర్గళ వాగ్ధార కన్నా మాట్లాడటంలో విచక్షణ ముఖ్యం' అని ఇంగ్లిష్ రాజనీతిజ్ఞుడు ఫ్రాన్సిస్ బేకన్ ఏనాడో చెప్పాడు. 'సకాలంలో పాటించే మౌనం వాగ్ధాటి కంటే గొప్పది' అని ఇంగ్లిష్ కవి మార్టిన్ టప్పర్ అన్నాడు. విచక్షణ లోపించిన మాటలు మాట్లాడేవారు ఎంతటి ఘనసంపన్నులైనా సమాజం నుంచి గౌరవ మర్యాదలను సంపాదించుకోలేరు. వాగ్ధాటికి, వాచాలతకు ఉన్న విభజనరేఖను తెలుసుకుంటే చాలు%–% మాటలాడే కళలో రాణించడం పెద్ద కష్టమేమీ కాదు. ఇంత చిన్న సంగతి తెలుసుకోలేకపోవడం వల్లనే ప్రజాజీవితంలో ఉన్న నానా రంగాల ప్రముఖులు అనవసర ప్రసంగాలతో, అసందర్భ ప్రలాపాలతో అభాసుపాలవుతున్న సందర్భాలు ఇటీవలి కాలంలో తరచుగా తారసిల్లుతున్నాయి. ఇదొక పరిస్థితి అయితే, వాగ్దూషణా దురితచరితుల సంఖ్య కూడా సమాజంలో పెచ్చరిల్లుతోంది. ముఖ్యంగా రాజకీయ, వినోదరంగాల్లో వాక్కాలుష్యం దుర్భరంగా మారి, సామాన్యులకు మనశ్శాంతి లేకుండా చేస్తోంది. వాక్కాలుష్య ప్రభావం ఏ స్థాయిలో ఉందో ఇటీవల వస్తున్న సినిమాలు, టీవీ కార్యక్రమాలు, ఓటీటీ ప్రదర్శనలు చూస్తే, ఇట్టే అర్థమైపోతుంది. 'ఆది నుంచి ఆకాశం మూగది/ అనాదిగా తల్లి ధరణి మూగది/ నడుమ వచ్చి ఉరుముతాయి మబ్బులు/ నడమంత్రపు మనుషులకే మాటలు/ ఇన్ని మాటలు' అన్నారు వేటూరి. నడమంత్రపు సిరివర్గం, మిథ్యామేధావి వర్గంలోని మనుషుల వల్లనే సమాజంలో వాక్కాలుష్యం ప్రబలుతోంది. పర్యావరణంలోని నానా రకాల కాలుష్యాల నివారణ కోసం ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు తమ వంతు చర్యలు చేపడుతూనే ఉన్నాయి. అయితే, వాక్కాలుష్య నివారణ చర్యలు తీసుకునే నాథులే కరవయ్యారు. వాక్కాలుష్య నివారణతోనే వాగ్భూషణానికి పునర్వైభవం సాధ్యం.

## మళ్లీ గట్టు దాటి.. తీన్మార్ మల్లన్న హాట్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

అయితే అంతకంటే ముందే..అదే కరీంనగర్ వేదికగా బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ హాజరైన బీసీ జేఏసీ మీటింగ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ ప్రత్యక్షం కావడం, తాజా పరిణామాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది."జానారెడ్డి కళ్లల్లో ఆనందం కోసం చిన్నారెడ్డి నాకు షోకాజ్ నోటీస్ పంపించారు. నేను ఈ బీసీ జేఏసీ సమావేశానికి వస్తే ఓ పార్టీ అభ్యర్థి బాధపడుతున్నారు. మరి అదే అభ్యర్థి.. నాకు షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పుడు ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదు?" అని ఎమ్మెల్సీ నవీన్ నిలదీశారు... రాహుల్ గాంధీ స్పిరిట్‌తోనే బీసీ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తున్నా. కానీ, నేను ఇలా చేయడం కాంగ్రెస్ లో మరి కొన్ని వర్గాలకు నచ్చడం లేదు. మీకు పడకపోతే నేను బీసీ ఉద్యమాన్ని ఆపుతానా?.. ఇస్సా, ఇజ్జత్, హుకూమత్ కోసమే బీసీ ఉద్యమమం అంటూ తీన్మార్ మల్లన్న హాట్ కామెంట్స్ చేశారు.

## నరేందర్‌రెడ్డి పట్టభద్రులకు ప్రభుత్వానికి వారధిగా ఉంటాడు

మొదటి పేజీ తరువాయి

నిజామాబాద్‌కు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్ వన్ పోస్టు ఇచ్చామన్నారు. వరంగల్‌కు చెందిన దీప్తికి గ్రూప్ 2 ఉద్యోగం ఇచ్చినట్లు చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను ముప్పుతిప్పలు పెట్టారని.. పదేళ్ల పాటు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిప్పారని విమర్శించారు. "నేను చెప్పింది నిజమైతేనే మాకు ఓటు వేయండి" అని కోరారు. నిజామాబాద్ రైతులు పంజాబ్ రైతులతో పోటీపడి పంటలు పండిస్తారన్నారు. రైతు రుణమాఫీ చేశామని.. రైతు భరోసా ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ సర్కారు చేసిన అప్పుకు ఇంత వరకు 75 వేల కోట్ల వడ్డీ కట్టామన్నారు. తాను సీఎం అయ్యాక ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీనెల ఒకటో తేదీన జీతం ఇస్తున్నామన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ 8 వేల కోట్లు బకాయి పెట్టారని.. రాబోయే రోజుల్లో నెలకు వెయ్యి కోట్ల చొప్పున చెల్లిస్తామని ప్రకటించారు. 'బండి సంజయ్ బడా బీసీ అంటున్నాడు. మీరు పదేళ్ళలో కులగణన ఎందుకు చేయలేదు. మీకోసం లెక్కలు తేల్చి నేను కొట్లాడుతున్నా. బలహీన వర్గాల లెక్కలు తప్పైతే ఆధారాలతో చూపండి. సొల్లు మాటలు వద్దు. గుజరాత్‌లో 29 కులాల ముస్లింలు బీసీ రిజర్వేషన్లు అనుభవిస్తున్నారు. మాదిగ ఉప కులాల వర్గీకరణ చేసి చట్టసభల్లో ఆమోదించాం. మోదీ, కృష్ణ మాదిగను కౌగిలించుకున్నాడు కానీ వర్గీకరణ చేయలదన్నారు. జర్నలిస్టుల సమస్యలు పట్టించుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు. టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు అరెస్ట్ కాకుండా అడ్డుకుంటుంది బండి సంజయ్, కిషన్ రెడ్డి. ఈ కార్ రేసులో కేటీఆర్‌ను ఈడీ ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనకు నిధులు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. పట్టభద్రులు అండగా నిలబడండి.. కేంద్రంతో కొట్లాడి నిధులు తెస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దూరదృష్టి ఉన్న నాయకుడు రేవంత్ రెడ్డి అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు.

# 43 శైవక్షేత్రాలకు 3,000 ప్రత్యేక బస్సులు

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రత్యేక బస్సులు ఫిబ్రవరి 24 నుంచి ఫిబ్రవరి 28 వరకూ అందుబాటులో ఉంటాయని భక్తులకు తీపి కబురు చెప్పింది. శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444, కీసరగుట్టకు 270, వేలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సులతోపాటు అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప ఆలయాలకు సైతం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లాలనుకునే భక్తులకు ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేబీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయని టీజీఎస్?ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సుల టికెట్ ధరలను 50 శాతం వరకూ పెంచినట్లు ఆయన వెల్లడించారు. అయితే సాధారణ సర్వీసుల టికెట్ ఛార్జీలలో ఎలాంటి మార్పులు చేయలేదని సజ్జనార్ పేర్కొన్నారు. మరోవైపు ఏడుపాయలకు వెళ్లే ప్రత్యేక బస్సులకు సవరించిన ఛార్జీలు ఫిబ్రవరి 26– 28 మధ్య వర్తిస్తాయని ఆయన తెలిపారు. గత శివరాత్రి కంటే ఈసారి ఆర్టీసీ యాజమాన్యం 809 అదనపు ప్రత్యేక బస్సులను నడుపుతోందని చెప్పుకొచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ ప్రత్యేక సేవలను ఉపయోగించి దేవాలయాలకు సురక్షితంగా వెళ్లి దర్శనం చేసుకోవాలని సజ్జనార్ ఆకాంక్షించారు. అయితే మహాశివరాత్రి ప్రత్యేక బస్సులలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం అమలులో ఉంటుందని సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. వెబ్‌సైట్‌లో బస్ టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చని చెప్పారు. మహా శివరాత్రి ప్రత్యేక బస్సుల గురించి మరిన్ని వివరాల కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సజ్జనార్ సూచించారు.

# మానసిక క్షోభలో రాష్ట్ర ఉద్యోగులు

మొదటి పేజీ తరువాయి

వాళ్లకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను కూడా కాలరాస్తున్నారని, ఆఖరుకు ఉద్యోగులకు, పెన్షనర్లకు రొటీన్‌గా అందాల్సిన చెల్లింపులను, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కూడా చెల్లించకుండా జాప్యం చేస్తూ వారిని తీవ్రమైన మానసిక ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని ఆయన లేఖలో పేర్కొన్నారు. పెండింగ్ డీఏలు, జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ బిల్లులు, గ్రాట్యుటీ పెన్షన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పేరుతో ఉద్యోగులు, పెన్షనర్లకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించడమనేది ప్రభుత్వ పాలనలో రొటీన్‌గా జరిగే వ్యవహారమన్నారు. కానీ వాటిని కూడా మీరు చెల్లించకపోవడంవల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.8,200 కోట్లు బకాయి పడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పట్ల మీరు అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని, ప్రభుత్వాన్ని నమ్ముకుని నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో, వారికి మీరు ఏ సందేశం ఇవ్వదలచుకున్నారో ఒక్కసారి ఆలోచించండన్నారు. అంతేకాకుండా..'ఇంకా బాధాకరమైన విషయమేమిటంటే గత ఏడాది 2024లో 8 వేల మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. ఈ ఏడాది మరో 10వేల మంది రిటైర్ కాబోతున్నరు. వారికి పదవీవిరమణకు సంబంధించిన ప్రయోజనాలను రూ.11 వేల కోట్ల రూపాయలు చెల్లించాలి. నేటి వరకు ఒక్కరికి కూడా చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసం అని అన్నారు. జీతం పైసల నుండి సొంతంగా జీపీఎఫ్‌లో దాచుకున్న సొమ్మును కూడా చెల్లించక పోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిత్యం మంత్రుల పేషీల చుట్టూ, అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. దశాబ్దాల తరబడి ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులకు మీరిచ్చే ప్రతిఫలం ఇదేనా? ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో మీరు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపూరిత విధానంతో తీరుతో లక్షలాది విద్యార్థులు, వందలాది మంది కళాశాలల యాజమాన్యాలు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. రాష్ట్రంలో ఇంటర్ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ వంటి కోర్సులను చదువుతున్న దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారు. కానీ గత బీఆర్ఎస్ పాలకులు గానీ, ప్రస్తుతమున్న మీ ప్రభుత్వం కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంవల్ల దాదాపు రూ.7,500 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యం కారణంగా కాలేజీల నిర్వహణ భారమై రాష్ట్రవ్యాప్తంగా వందలాది కాలేజీలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో కాలేజీలు మూతపడ్డాయి. 90? కాలేజీ యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు సకాలంలో ఇవ్వలేని కారణంగా కాలేజీల సిబ్బంది ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులు పెరగడంతో ఆయా కాలేజీల నిర్వహణ కూడా భారంగా మారింది. సరైన వేతనాలు చెల్లించలేకపోవడంతో..విద్యా ప్రమాణాలు కూడా దెబ్బతింటున్నాయి. ఇది రాష్ట్ర విద్యావ్యవస్థకే పెనుసవాల్‌గా మారే పరిస్థితులను సృష్టిస్తోంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సంవత్సరాల తరబడి చెల్లించకపోవడంతో తమ కాలేజీలు నడవాలంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ భారాన్ని విద్యార్థులే మోయాలని, లేనిపక్షంలో సర్టిఫికెట్లు ఇవ్వబోమని యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంవల్ల సామాన్య, బడుగు బలహీనవర్గాల విద్యార్థులు అనేక మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లుల్లో సుమారు రూ.380 కోట్ల మేరకు చెల్లిస్తామని గత ఏడాది నవంబరులో టోకెన్లను జారీ చేసినా.. ఇంతవరకు ఎటువంటి చెల్లింపులు జరపకుండా కాలేజీ యాజమాన్యాలను పాలకపార్టీ నాయకులు చుట్టూ తిప్పుకుంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను క్లియర్ చేస్తామని మీరు హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు మీరు మంచిర్యాల, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసింది. మీ సభలకు పెద్దమొత్తంలో తరలిరావాలని, కళాశాలలు మూసేసి.. సిబ్బందిని తీసుకురావాలని, లేకుంటే ఇబ్బంది పడతారని ఆయా జిల్లాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాలేజీ యాజమాన్యాలను బెదిరిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. మీ ప్రభుత్వ అసమర్థత కారణంగా ఇప్పటికే తీవ్రమైన మానసిక క్షోభను అనుభవిస్తున్న కాలేజీ యాజమాన్యాలు.. ఇప్పుడు మీ కార్యక్రమం కోసం బెదిరింపులు ఎదుర్కొంటుండటం దురదృష్టకరం అన్నారు. ఇది కాకుండా.. ఏప్రిల్, మే నెలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని మీరు కాలేజీ యాజమన్యాలను మళ్లీ మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ పార్టీ గట్టెక్కడానికే.. మీరు ఇలాంటి చర్యలకు పూనుకోవడం ముఖ్యమంత్రి పదవికి ఏ మాత్రం శోభను ఇవ్వదని గుర్తుంచుకోవాలి. మీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా యుద్ధ ప్రాతిపదికన తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలి. అదే విధంగా.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏలు, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఖఖీఅ బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలి. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ మొత్తాన్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను.' అని కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి ఆశ చూపి 14 నెలలుగా ఒక్కొక్కరికి రూ.56 వేలు బకాయిపడి యువతను దగా చేశారు. ఏమాత్రం నిజాయతీ ఉన్నా యుద్ధ ప్రాతిపదికన ఆ బకాయిలు విడుదల చేయాలి. నేడే రూ.7,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును కాలేజీ యాజమాన్యాల ఖాతాల్లో జమ చేయాలి. ఇవన్నీ విడుదల చేసిన తర్వాతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడగాలని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

## కెసిఆర్ ఇంటర్‌నెట్ సెంటర్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామానుజపురం గ్రామానికి చెందిన ఉద్యమ కారుడు చిర్ర లింగన్న కుమారుడు సతీష్. సతీశ్‌కు చిన్నప్పటి నుంచి కేసీఆర్ అంటే ప్రాణం. 2001లో టీఆర్ఎస్ స్థాపించిన నాటి నుంచి కార్యకర్తగా ఉన్నాడు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ఆర్థిక ఇబ్బందులు, అంగవైకల్యాన్ని ఎదిరించిన సతీష్ డిగ్రీ పూర్తి చేశారు. బీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. 2025 ఫిబ్రవరి 17న కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా.. ఇంటర్నెట్ సెంటర్ ద్వారా తనకు స్వయం ఉపాధికి కల్పించాలని ఎమ్మెల్సీ కవితకు విజ్ఞప్తి చేశారు. సతీష్ విజ్ఞప్తికి కవిత వెంటనే స్పందించి.. సాయం చేస్తానని హామీ ఇచ్చారు. వారం రోజుల్లోనే సొంతం ఖర్చులతో ఇంటర్నెట్ సెంటర్‌ను ఏర్పాటు చేయించారు. ఈ ఇంటర్నెట్ సెంటర్‌కు కేసీఆర్ పేరును సతీశ్ పెట్టుకున్నాడు. జిల్లా పర్యటనలో భాగంగా నేడు 'కేసీఆర్' ఇంటర్నెట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇంటర్నెట్ సెంటర్ ఏర్పాటుపై ఎమ్మెల్సీ కవిత స్పందించారు. 'కార్యకర్తలే పార్టీకి ఆయువుపట్టు. కార్యకర్తలకు అండగా ఉండడం కేసీఆర్ గారు మనకు నేర్పిన బాధ్యత. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త, కేసీఆర్ గారి వీరాభిమాని చిర్రా సతీష్ గారికి స్వయం ఉపాధి కల్పించడం నా బాధ్యతగానే భావించా. కార్యకర్తలు, వారి కుటుంబాలకు అన్ని రకాల మద్దతు ఇవ్వడంలో ముందుండే ఏకైక పార్టీ బీఆర్ఎస్. సతీష్ కేసీఆర్ ఇంటర్నెట్–జిరాక్స్ సెంటర్‌ను ప్రారంభించే అవకాశం నాకు కలగడం సంతోషంగా ఉందని కవిత పేర్కొన్నారు. తనకు ఇంత పెద్ద సాయం చేసిన కవితకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్, కవితలకు తన కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని చెప్పుకొచ్చాడు.

## మూడు రోజులపాటు మద్యం దుకాణాలు బంద్

మొదటి పేజీ తరువాయి

వైన్ షాపులతో పాటు కల్లు దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు కూడా మూసివేయనున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్ సిటీ శివారులు మద్యం షాపులు పూర్తి బంద్ అవనున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. మెదక్– నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ ఉపాధ్యాయ స్థానానికి, అదే స్థానంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ రెండింటితో పాటు వరంగల్–ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికలు జరుగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఏడు ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మద్యం షాపులను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు గ్రామాల్లో మద్యం షాపులు మూతపడతాయి. యాదాద్రి జిల్లాలో కూడా ఈ నిబంధనలు అమల్లో ఉంటాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరికలు కూడా జారీ చేశారు.

## మాజీ సీఎంపై మంత్రి కొండా సురేఖ సెటైర్

మొదటి పేజీ తరువాయి

దుబాయ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీం ఇండియా ఘన విజయం సాధించడం హర్షణీయమన్నారు. 6 వికెట్ల తేడాతో భారత్ బంపర్ విక్టరీ కొట్టిన విషయం అందరం టీవీలో చూసి సంబురపడ్డామన్నారు. 14 వేల రన్నులు కొట్టి విరాట్ కోహ్లీ రికార్డు బద్దలు కొట్టగా... మన రాష్ట్ర ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా దాదాపు ఈ 14 నెలల కాలంలో 14 రోజులు కూడా అసెంబ్లీకి రాలేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలకి అందుబాటులో ఉండకపోవడం దేశ రాజకీయ చరిత్రలో పెద్ద రికార్డే కదా అంటూ ఎద్దేవా చేశారు. 14 వేల రన్నులు చేసిన విరాట్ కోహ్లీ ఒకవైపు వార్తల్లో పతాక శీర్షికలలో నిలిస్తే... 14 నెలలుగా ఇంకా విరాట పర్వం వీడని ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా వార్తల్లోకి ఎక్కడం ఆలోచించాల్సిన విషయం కాదా? అంటూ మంత్రి సురేఖ ట్వీట్ చేశారు.

## బీఆర్ఎస్ నేతలకు కనీస మానవత్వం లేదు

మొదటి పేజీ తరువాయి

ఎస్ఎల్‌బీసీ ప్రమాద స్థలి దోమలపెంటకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలకు మానవత్వం లేదని.. ఎస్ఎల్‌బీసీ ప్రమాదాన్ని రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నిరంతరం అక్కడ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. తూప్రాన్ రైలు ప్రమాదంలో స్కూల్ విద్యార్థులు చనిపోతే కేసీఆర్ కనీసం వెళ్లి పరామర్శించలేదని విమర్శించారు. మీరు చేయని పనులు మేము చేస్తున్నామని.. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అందరం కలిసికట్టుగా ఉండాలన్నారు. ఆపదలో ఉన్నవారికి మనోధైర్యం ఇవ్వాలని, సురక్షితంగా తీసుకురావడానికి సలహాలు ఇవ్వాలన్నారు. ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదని.. అందరినీ బయటకు తెచ్చిన తర్వాత మళ్లీ పనులు మొదలు పెడతామని.. ఆ తర్వాత బీఆర్ఎస్ వాళ్ల సంగతి చెబుతామన్నారు. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) ఎస్ఎల్‌బీసీని నిర్లక్ష్యం చేసిందని, మేము దాన్ని పూర్తి చేయాలని భావిస్తే ఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరమని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అందులో చిక్కుకున్న 8 మంది క్షేమంగా బయటకు రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని అన్నారు. సొరంగం గురించి, ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. పదేళ్లు సొరంగాన్ని ఎందుకు పట్టించుకోలేదో చెప్పాలని.. కాళేశ్వరంలో చిన్న చిన్న సొరంగం పనులకు ఎంతో మంది చనిపోయారని, కాళేశ్వరంలో చనిపోతే బీఆర్ఎస్ నేతలు ఏమైనా రెస్క్యూలు చేశారా అని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

# మహాశివరాత్రికి ముస్తాబైన సోమలింగేశ్వర ఆలయం

**– సోమలింగేశ్వర ఆలయాన్ని అన్నీ తానే అభివృద్ధి పరిచిన పోచారం శంభు రెడ్డి**

**కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 24**

నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామ శివారులోని సోమలింగేశ్వర ఆలయం కాకతీయుల కాలం నాటి ఈ ఆలయంలో ఆధునిక శిల్పకళ నైపుణ్యంతో ఉట్టిపడే స్వయంభు లింగేశ్వర ఆలయం ప్రసిద్ధి చెందింది. గతంలో 1984 సంవత్సరంలో బాన్సువాడ పట్టణానికి చెందిన వ్యాపారస్తులు నాగులగామా గిర్మాయ గుప్తా, విట్టల్ రెడ్డి రాం నారాయణ ఖేడియాలు ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి ఆలయంలో పద్మవ్యూహం నిర్వహించి వారం రోజులపాటు భక్తులకు అన్నదానం ప్రత్యేక పూజలతో పాటు అగ్ని గుండాలు, యజ్ఞ యాగాది కార్యక్రమాలు నిర్వహించగా వేలాది మంది భక్తులు లారీలు ట్రాక్టర్లు కట్టుకొని ఆలయాన్ని దర్శించేందుకు తరలివచ్చారు. నాగులగామా గిర్మాయ గుప్తా పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఇతరుల నుండి సహకారం లభించకపోవడంతో వారు కార్యక్రమాలు మానుకున్నారు.

**సోమలింగేశ్వర ఆలయానికి ఘనమైన చరిత్ర....**



దుర్కి గ్రామ శివారులోని సోమలింగేశ్వర ఆలయం, అడికేశ్వర లింగం, ఓట్లం పరమేశ్వర లింగం, చిన్న కొడప్ గల్ శివారులోని రామేశ్వర లింగం, బోర్లం శివారులోని బసవేశ్వర లింగాలను ఒకేరోజు దర్శిస్తే ఎంతో పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. ఈ ప్రాంతంలో సప్త ఋషులలో ఒకరైన దుర్వాస మహర్షి తపస్సు చేసి ఉండడం వలన దుర్వాస మహాముని పట్టణంగా పేరుగాచి కాలక్రమేన దుర్కి గ్రామముగా వాడుకలోకి వచ్చిందని ప్రచారంలో ఉంది. అలాగే ఈ ప్రాంతానికి సోమభూపాలుడు పరిపాలించడం వలన ఈ ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి సోమలింగేశ్వర స్వామి ఆలయంగా పిలిచారని, ఈ ఆలయం పశ్చిమాభిముఖంగా వెలిసి ఉండడం ఈ ఆలయంలో చతురస్ర ఆకారంలో ఒక స్తంభంపై నాలుగు వైపులా లిపి చెక్కి ఉండడం విశేషం.ఎంతో ప్రశాంత వాతావరణంలో ఉన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గతంలో పర్యాటక శాఖ అధికారులు వచ్చి పర్యాటక కేంద్రంగా మారుస్తామని చెప్పినప్పటికీ ఆలయాన్ని అభివృద్ధి పరచడంలో



మాత్రం వారు శ్రద్ధ చూపెట్టకపోవడంతో ఆలయం అభివృద్ధికి నోచుకోలేకపోయింది..

**అన్ని తానై సోమలింగేశ్వర ఆలయాన్ని తీర్చిదిద్దిన పరిగిశంభు రెడ్డి**

ఆధ్యాత్మికత రంగంలో కార్యక్రమాలు విజయవంతం కావాలన్నా, ఆలయాలను అభివృద్ధిపరిచి భక్తుల మనోభావాలను పెంపొందించే విధంగా కృషి చేయడంలో పరిగే శంభురెడ్డి ఎప్పుడు ముందుంటారు. గతంలో ఎంతోమంది వ్యాపారవేత్తలు ఆలయాన్ని అభివృద్ధి చేద్దామని ఎన్నో ప్రయత్నాలు చేసినా వారి ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఆదిలోనే మానుకున్న సంఘటనలు ఉన్నాయి. వారందరికీ భిన్నంగా పరిగే శంభూ రెడ్డి తాను అనుకుంటే ఏదైనా సాధించాల్సిందేనన్న మనసత్వం ఉన్న శంభు రెడ్డి గత సంవత్సరం సోమలింగేశ్వర ఆలయ రూపురేఖలు మార్చేందుకు తాను దగ్గరుండి ఆలయ ప్రాకార మండపం, ఆలయ శిఖర పనులు, ఆలయం వెలుపల ఆధ్యాత్మికత వెల్లివెరిసే విధంగా చేయడంతో పాటు, భక్తులు ఉత్సవాలప్పుడు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించుకునేందుకు శివలింగాలను ఏర్పాటు చేసి దేవుడిని భక్తులకు మధ్య వారధిగా వ్యవవరిస్తూ అందరి మన్ననలు శంబురెడ్డి పొందారు. సోమలింగేశ్వర ఆలయాన్ని దర్శించేందుకు ఉమ్మడి జిల్లా ప్రాంత ప్రజలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు సైతం ప్రస్తుతం ఆలయాన్ని దర్శిస్తుంటారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు కొరకు పరిగే శంభురెడ్డి ప్రస్తుతం ఆలయ పుష్కరిణి నిర్మిస్తుండడంతో భక్తులు స్నానమాచరించి సోమలింగేశ్వరుని దర్శించుకునే విధంగా భక్తులకు ఏర్పాట్లు చేయడంలో అయినా విజయవంతమయ్యారు. మహాశివరాత్రి పురస్కరించుకొని సోమలింగేశ్వర ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రతి సంవత్సరం శివరాత్రి మరుసటి రోజు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆలయ ఆవరణలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సోమలింగేశ్వర ఆలయాన్ని పునర్నిర్మానించి భక్తులను అందుబాటులోకి తీసుకువచ్చిన పోచారం శంబురెడ్డి దాతృత్వాన్ని భక్తులు అభినందిస్తున్నారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయి..... విద్యాశాఖ అధికారి శ్రీహరి

**– ఇన్స్పైర్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన మండల విద్యాశాఖ అధికారి**

**కబురు న్యూస్ గాంధారి ఫిబ్రవరి 24**

విద్యార్థులలో చిన్ననాటి నుండి వారిలోని వైజ్ఞానిక నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇన్స్పైర్ ప్రైవేటు పాఠశాల ముందుకు వచ్చి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి శ్రీహరి అన్నారు. సోమవారం గాంధారి మండలంలోని సర్వాపూర్ గ్రామ శివారులో గల ఇన్స్పైర్ ప్రైవేటు పాఠశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి శ్రీహరి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు తయారుచేసిన వైజ్ఞానిక ప్రదర్శన పట్ల ఆయన మంత్రముగ్ధుడయ్యారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు 70 ప్రదర్శనలు చేపట్టి ప్రదర్శనకు విచ్చేసిన



వీక్షకులకు వివరించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యా దశ నుంచే విద్యార్థులలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం వల్ల, భవిష్యత్తులో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుండే చదువుతోపాటు వైజ్ఞానిక ప్రదర్శనలు, క్రీడల పట్ల ఆసక్తి కనబరిచి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష్యానికి అనుగుణంగా చదువుకొని సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చేసిన ప్రదర్శనలు పలువురుని




ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగార్జున గౌడ్, పాఠశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్ గౌడ్, ట్రాస్మ నాయకులు సురేష్ చంద్ర, మహేందర్ గౌడ్, ఇంపాక్ట్ నిపుణులు నక్క నవీన్, కరస్పాండెంట్లు వినయ్, సాయికుమార్, పండరి గౌడ్, సంజీవ్, ఉపాధ్యాయ బృందం నాగరాజు, లక్ష్మి శ్వేతాంజలి, భాస్కర్, శివానంద్, జీవన్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పేరెంట్స్ తో సమావేశం నిర్వహించిన ఎంఈఓ...

**కబురు న్యూస్,బోధన్ ఫిబ్రవరి 24..**





బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులతో మండల విద్యాధికారి నాగయ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సోమవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో పదవ తరగతి విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పరీక్ష పత్రాలలోని ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు చదువుకుని జవాబులు రాయాలని చెప్పారు. తమ పిల్లలు ఇంటి దగ్గర ఒత్తిడి గురి కాకుండా తల్లిదండ్రులు చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవి, నగేష్, విలేజ్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ గంగాధర్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కొరకు ప్రచారం నిర్వహించిన నాయకులు



**కబురు న్యూస్ మద్నూర్ ఫిబ్రవరి 24**

మద్నూర్ మండల కేంద్రంలో బిజెపి పట్టభద్రుల అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి కొమురయ్య లకు మద్దతుగా సోమవారం మండల అధ్యక్షుడు తుకారాం ఆధ్వర్యంలో పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరప్ప, సంతోష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

# అధునాతన వసతులతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు

**– విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా వెల్లడి...**

**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరే,ఫిబ్రవరి 24 :**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో అధునాతన వసతి, సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను అందుబాటులోకి తేవడం జరుగుతుందని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా వెల్లడించారు. సోమవారం ఆమె రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కె.రామకృష్ణారావు తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాలు, వసతుల కల్పన కోసం చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని సౌకర్యాలతో వసతిని కల్పిస్తూ, ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే




మంజూరీలు తెలుపబడిన ఆయా నియోజకవర్గాలలో సాధ్యమైనంత త్వరగా వీటి నిర్మాణాలు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటును అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తూ, నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, పనుల నాణ్యత, అధునాతన వసతి సదుపాయాల కల్పనలో ఎంతమాత్రం రాజీ పడకూడదని సూచించారు. ఆయా నిర్మాణ దశలకు అనుగుణంగా, పక్కాగా పరిశీలన చేసిన మీదట నిధులు చెల్లించాలని అన్నారు. అందరికి



ఆదర్శంగా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను అధునాతన సదుపాయాలతో అలరారేలా నిర్మాణాలు జరిపించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ,ఇప్పటికే జిల్లాలోని బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాలలో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలకు మంజూరీలు లభించాయని, తక్షణమే పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అంకిత్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకునేలా వసూలు బాటు కల్పించాలి.... జిల్లా కలెక్టర్

**కబురు న్యూస్ కామారెడ్డి ఫిబ్రవరి 24**



శాసనమండలి పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న వారికి సంబంధిత నిర్వాహకులు వెసులుబాటు కల్పించాలని సోమవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న పోలింగ్ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి, సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ కొనసాగుతుందన్నారు. జిల్లాలోని వ్యాపార ,వాణిజ్య, విద్యాసంస్థల్లో పనిచేసే పట్టబద్రులు కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకొని ఎలా సౌకర్యాలను కల్పించాలని ఆయన ఆయా యాజమాన్యాలకు సూచించారు.

# ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి

**– కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...**

**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,ఫిబ్రవరి 24 :**

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. వారోత్సవాలను పురస్కరించుకుని లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను సోమవారం సమీకృత జిల్లా



కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్థిక అక్షరాస్యత కింద జిల్లాలో చేపట్టే కార్యక్రమాల గురించి అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలాన్నారు. ప్రధానంగా పాదుపు పై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను ఏర్పాటు చేయాలని, అవగాహన ర్యాలీలు, వినియోగదారులతో ఆర్థిక అక్షరాస్యత సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో జెడ్పి సీ.ఈ.ఓ సాయాగౌడ్,నాబార్డు డీడీఎం ప్రవీణ్, మెప్మా పీ.డీ రాజేందర్, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కూడా బిజెపి జెండా ఎగరవేస్తాం......

# బిజెపి ఎంపీ, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

- మూడు ఎమ్మెల్సీ స్థానాలను బిజెపి కైవసం చేసుకుంటుంది.... డీకే అరుణ







**కబురు న్యూస్ కామారెడ్డి ఫిబ్రవరి 14**
దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికల స్ఫూర్తిగా తెలంగాణలో కూడా బిజెపి జెండా ఎగరవేస్తామని మహబూబ్ నగర్ ఎంపీ, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కోర్టు న్యాయవాదులతో ఆమె సమావేశమై, గ్రంథాలయం ఆవరణలో పట్టభద్రులను కలిసి బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు అనేక హామీలను ఇచ్చి మోసం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉపాధ్యాయులకు ఐదు డిఏలు ఇస్తామని చెప్పి, పిఆర్సి సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేయలేదని, దేశంలో ఎక్కడ తెలంగాణ లాంటి పాలనలేదని, ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ మోడల్ అన్నారు. ఆరు గ్యారెంటీ హామీలతో 420 హామీలు ఇచ్చి అమలు చేస్తున్నామని గొప్పలు చెబుతున్నారని క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదని, కొందరికి ఇచ్చి అందరికీ ఇచ్చామని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఎస్ ఎల్ బి సి టన్నెల్లో కార్మికులు అవస్థలు పడుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ముఖ్యమని ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు..

**మూడు ఎమ్మెల్సీ స్థానాలు కైవసం చేసుకుంటాం.**

రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలను బిజెపి పార్టీ అభ్యర్థులు గెలవబోతున్నారని, గెలిచే అభ్యర్థులను ఓడించేందుకు డబ్బులు తీసుకొని టికెట్ ఇచ్చారన్న ప్రచారాన్ని ఓవర్గం ప్రచారం చేస్తుందని ఈ కుట్రలకు బిజెపి నాయకులు భయపడరని, ఎన్నికల్లో గెలిచేది బిజెపి అభ్యర్థులేన్నారు. హర్యానా మహారాష్ట్ర ఢిల్లీలో బిజెపి జెండా ఎగరవేశామని తెలంగాణ లో కూడా బిజెపి జెండా ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, రాష్ట్ర నాయకులు మురళీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే అరుణాతార,జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు, ప్రబారి పెద్దోళ్ల గంగారెడ్డి, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కబురు క్యాలెండర్ ఆవిష్కరణ



**కబురు న్యూస్,నిజామాబాద్ లీగల్,ఫిబ్రవరి 24 :**
నిజామాబాద్ జిల్లా కేంద్రంగా వెలువడుతున్న కబురు దినపత్రిక 2025 వార్షిక క్యాలెండర్ ను నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల జిల్లాకోర్టు ప్రాంగణంలోని తన చాంబర్ లో సోమవారం రోజున కబురు సంపాదకులు శివకుమార్ గౌడ్,నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్,సీనియర్ న్యాయవాది ఆశ నారాయణలతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఇరవై ఆరేళ్లుగా జిల్లా ప్రజలకు సుపరిచితమైన కబురు దినపత్రిక కలకాలం వర్ధిల్లాలని అభిలాషించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ అయ్యేవిదంగా కబురు తనవంతు కృషి చేస్తిన్నదని ఆమె పేర్కొన్నారు.సమాజంలో పత్రికలు,పాత్రికేయులది కృషి మరువలేనిదని అన్నారు.

## అభివృద్ధి చేసే ప్రభుత్వానికి అండగా నిలబడాలి....

## పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్



**కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 24**
అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతూ, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించిన ప్రభుత్వానికి పట్టభద్రులు ఉపాధ్యాయులు అండగా నిలబడి ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్ అన్నారు. సోమవారం బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి మద్దతుగా స్థానిక నాయకులతో పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఏళ్ల తరబడి వేచి చూశారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగుల ప్రకటన చేసి నిరుద్యోగుల ఆశయాన్ని నెరవేర్చిందని, పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలెపు వెంకటరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండి సాయిలు యాదవ్, రఫిక్, నవీన్ రెడ్డి, మోహన్ ,అనిల్, గంగాధర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఆకలిని తీర్చడమే ఆశయం కావాలి




**కబురు న్యూస్,నిజామాబాద్ లీగల్,ఫిబ్రవరి 24 :**
సమయానికి ఆకలితో ఉన్నవారికి ఆకలిదప్పికను తీర్చడమే ఆశయం కావాలని నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల అన్నారు.జిల్లాకోర్టు ప్రాంగణంలో సోమవారం కొనసాగిన అన్నదానం



కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు.ప్రతి సోమవారం అన్నదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక చేదోడుగా నిలుస్తున్నారని ప్రశంసించారు.న్యాయస్థానానికి వచ్చే కక్షిదారులకు అన్నదానం ఉపయుక్తంగా ఉన్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి,సీనియర్ న్యాయవాది జి.వి.కృపాకార్ రెడ్డి,బార్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్,చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుభేదార్,న్యాయవాదులు ఆశనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకుని సీఎం ప్రచారం చేస్తున్నారు



- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఫిబ్రవరి 24 :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనకు వచ్చారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ ప్రశ్నించారు. పట్టభద్రుల,టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నగరంలో చంద్రశేఖర్ కాలనీలో రీజినల్ లైబ్రరీలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిద్దుల గుట్ట మీద ఒట్టు పెట్టి ఇప్పటివరకు ఒక్క హామీ నెరవేర్చకుండా ఏ మొఖం పెట్టుకొని నిజామాబాద్ కు ఓటు అడగటానికి వచ్చారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వం ఇస్తానన్న 2 లక్షల ఉద్యోగాలలో?నిజామాబాదు యువతకు ఎన్ని ఇచ్చారో చెప్పాలన్నారు. రూ.4 వేల భృతి ఎంత మంది నిరుద్యోగులకు ఇచ్చారని,రూ.2500 ఎంత మంది ఆడపచులకు ఇచ్చారని ప్రశ్నించారు. రూ. 6 వేల కోట్ల ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలతో ఎస్సీ,ఎస్టీ,బీసీ ల విద్యార్థులు చదువులకు దూరం అయ్యే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించించదని మండిపడ్డారు. జిల్లా జర్నలిస్ట్ లకు ఇందిరమ్మ ఇండ్లు,వారి సంక్షేమనికి ఎన్ని నిధులు కేటాయించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల తరుపున మండలిలో ప్రశ్నించే గొంతు వినపడాలంటే బీజేపీ బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ,మండల అధ్యక్షులు ఆనంద్ రావు,బీజేపీ నాయకులు వినోద్,మాస్టర్ శంకర్,గంగాధర్,మఠం పవన్,ఆనంద్,సాయి ప్రవీణ్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకే టీజెఎస్ మద్దతు



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఫిబ్రవరి 24 :**
శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులకే మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ జన సమితి నాయకులు తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ ఆదేశాల మేరకు సోమవారం నిజామాబాద్ నగరంలో పార్టీ నేతల అత్యవసర సమావేశం నిర్వహించారు.పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో నరేందర్ రెడ్డికి, టీచర్స్ స్థానం కోసం పోటీ చేస్తున్న వై.అశోక్ కు తమ పార్టీ మద్దతు ప్రకటిస్తుందని టీజెఎస్ నేతలు దువ్వ వెంకట్, కిరణ్ తెలిపారు.నరేందర్ రెడ్డి,అశోక్ ల గెలుపు కోసం తాము విస్తృతంగా ప్రచారం చేస్తానని పేర్కొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పించాలి



- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...

**కబురు న్యూస్,నిజామాబాద్,ఫిబ్రవరి 24 :**
ఈ నెల 27న నిజామాబాద్,కరీంనగర్,మెదక్, ఆదిలాబాద్ పూర్వ జిల్లాలతో కూడిన కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ జరగనున్న సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రైవేట్ సంస్థలలో పని చేస్తున్న వారికి సంబంధిత యాజమాన్యాలు వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ఒక ప్రకటనలో సూచించారు.ఈ నెల 27న (గురువారం) ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఎమ్మెల్సీ పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు.జిల్లాలోని వ్యాపార,వాణిజ్య,పారిశ్రామిక సంస్థలు,ఇతర అన్నిసంస్థల యాజమాన్యాలు, నిర్వాహకులు తమ సంస్థలలో పని చేసే పట్టభద్రుల నియోజకవర్గాలలో ఓటర్లుగా నమోదైన ఉద్యోగులు,కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకునేలా సౌకర్యాలను కల్పించాలని అన్నారు. పోలింగ్ రోజున ఓటు హక్కు కలిగి ఉన్న వారు నిర్ణీత సమయంలోపు ఓటు వేసేందుకు వీలుగా వారికి విధులకు ఆలస్యంగా హాజరు కావడానికి అనుమతించడం,షిఫ్ట్ ల సర్దుబాటు, తక్కువ పని గంటలు కేటాయించడం వంటి వెసులుబాటు కల్పించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.

## మల్లికార్జున స్వామి కళ్యాణనికి మైనంపల్లి కి ఆహ్వానం



**కబురు న్యూస్, ప్రతినిది ..నిజాంపేట్**
నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామంలో యాదవ కులస్తుల దైవమైనటువంటి శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ కార్యక్రమానికి హాజరుకావాలని సోమవారం యాదవ కుల సంఘ సభ్యులు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు

## జర్నలిస్టు సమస్యలు పరిష్కరించాలి

- జర్నలిస్టులపై దాడులు అరికట్టేలా ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి...
- టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి...

**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,ఫిబ్రవరి 24 :**
రాష్ట్రంలో జర్నలిస్ట్ లు పరిస్థితి దారుణంగా మారాయని అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారని చాలీచాలని వేతనాలతో బ్రతుకులు ఈడుస్తున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆవేదన వ్యక్తం చేసింది.టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కమిటీ



ఆధ్వర్యంలో కలెక్టరేట్ చాంబర్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి రాంచందర్ మాట్లాడుతూ,ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు.కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వమే రివ్యూ పిటిషన్ వేసి వాదనచేసి జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.జర్నలిస్టులకు కొత్త ఆరోగ్య భీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగుల మాదిరిగా అమలు చేయాలని జర్నలిస్టుల కంట్రిబ్యూషన్ ప్రభుత్వం భరించాలని కోరారు.కొత్త అక్రిడేషన్ కార్డులు అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని,రెండుసార్లు వాయిదా వేసింది అని వెంటనే జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు.ఇతర రాష్ట్రాల మాదిరి జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయాలని కోరారు.జర్నలిస్టులపై అరికట్టాలని ఇందుకోసం ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని కోరారు.అర్హత ఉన్న చిన్న మధ్య తరహా పత్రికలను ఎన్ ప్యానల్ లో చేర్చాలని కోరారు.వార్తల సేకరణకు కలెక్టరేట్ కు వచ్చే జర్నలిస్టుల కోసం కలెక్టరేట్లో ఒక ప్రత్యేక గది కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్,రాష్ట్ర కమిటీ సభ్యురాలు అడవల అనిత,జర్నలిస్ట్ నాయకులు మధు,రాకేష్,రాజేందర్,కృష్ణ,అమంద్ ప్రవీణ్ పాల్గొన్నారు.

# శివ సన్నిధికి వెళ్లి శివైక్యం చెందిన యువకుడు

**– మహా కుంభమేళకు వెళ్లి యువకుడు అనారోగ్యంతో మృతి**

**కబురు న్యూస్, ప్రతినిధి మల్లాపూర్ ఫిబ్రవరి 24**



మల్లాపూర్ మండలంలోని కొత్త దామరాజు పల్లి కు చెందిన బద్దం శేఖర్ రెడ్డి 29 సంవత్సరాలు మహా కుంభమేళకు వెళ్లి వస్తుండగా ఆకస్మికంగా వచ్చిన మెదడు వ్యాధితో అక్కడ దగ్గరలోని ఆసుపత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ మరణించినాడు అతని మరణం పట్ల అతని సొంత గ్రామంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి పవిత్ర పుణ్య స్థానానికి వెళ్లి అనారోగ్యంతో అనంత లోకాలకు వెళ్లాడని పలువురు రోదించారు ఇట్టి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు ఈరోజు కుటుంబాన్ని పరామర్శించారు

# పోస్టల్ బ్యాలెట్ కోసం ఐడీఓసీ(కలెక్టరేట్) లో ఫెసిలిటేషన్ సెంటర్

**సద్వినియోగం చేసుకోవాలని కోరిన కలెక్టర్...**

**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,ఫిబ్రవరి 24 :**

నిజామాబాద్,కరీంనగర్,మెదక్,ఆదిలాబాద్ పూర్వ జిల్లాలతో కూడిన కరీంనగర్ నియోజకవర్గ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకునేందుకు వీలుగా ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి కోసం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లోని ఎన్.ఐ.సీ హాల్ (రూమ్ నెంబర్ 21) లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలలో ఓటు హక్కు కలిగి



ఉండి,ఎలక్షన్ డ్యూటీ కేటాయించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ సదుపాయాన్ని కలిపించామన్నారు.ఈ నెల 25న (మంగళవారం) ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కు ఒక్క రోజు మాత్రమే అవకాశం కలిపించడం జరిగిందన్నారు.ఎన్నికల విధులను కేటాయిస్తూ జారీ చేసిన డ్యూటీ ఆర్డర్ కాపీతో పాటు, ఎన్నికల సంఘం నిర్దేశించిన ఏదైనా ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకుని వచ్చి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు.పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్లో పోలింగ్ బృందాన్ని నియమించడంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను కల్పించడం జరిగిందన్నారు.నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు 235 మంది, ఇతర జిల్లాలకు చెందిన మరో 20 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోరుతూ ఫారం-12 ద్వారా దరఖాస్తులు చేసుకున్నారని కలెక్టర్ వివరించారు.


# ఎస్సెస్సీ,ఇంటర్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

**– అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్**

**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్, ఫిబ్రవరి 24 :** పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మార్చి నెల 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అలాగే, పదవ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుండి ఏప్రిల్ 04 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయని వివరించారు. ఇంటర్ పరీక్షలకు 36222 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. అదేవిధంగా పదవ తరగతి పరీక్షలకు 22915 మంది విద్యార్థులకు గాను 141 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు



అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో ఎస్.ఈ రవీందర్ కు సూచించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేర్చాలన్నారు. పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు



చేరుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ హితవు పలికారు. ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉంచాలని, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో



నియమిస్తూ, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. సమీక్షా సమావేశంలో జెడ్పి సీఈఓ సాయాగౌడ్, డీఐఈఓ రవికుమార్, జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ విజయభాస్కర్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ,బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం

**– బీఆర్ఎస్ ను ప్రజలు తిరస్కరించినా కుట్రలు మానడం లేదు...**

**– పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్ రెడ్డి...**

**కబురు న్యూస్,నిజామాబాద్,ఫిబ్రవరి 24 :** బీజేపీ,బీఆర్ఎస్ కుట్రలు,కుతంత్రాలు చేస్తూ ప్రభుత్వాన్ని బలహీనపర్చాలని చూస్తున్నాయని,నాలుగు కోట్ల ప్రజల ఆలోచనలతో ఎన్నికైన ప్రజా ప్రభుత్వం తమదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాలులో సోమవారం రోజున నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు.ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ కుట్రలు మానడం లేదని ఆరోపించారు.తెలంగాణతో బీఆర్ఎస్ కు పేరు బంధమే కాదు.పేగు బంధం కూడా లేదని తరిమి కొట్టారన్నారు.కాంగ్రెస్ ను ఓడించాలంటున్న బీఆర్ఎస్ వాళ్లు ఎవరికి ఓటు వేయాలో చెప్పడం లేదన్నారు.ముందు మీ పరిస్థితిని మీరు అంచనా వేసుకోవాలని హితవు పలికారు.అభ్యర్థి లేని ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ నిలిచిందన్నారు.10 నెలల పాలనలో కాంగ్రెస్ ఏమీ చేయలేదని అంటున్న బీఆర్ఎస్ వాళ్లు తమ పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగుల ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూ,హైదరాబాద్ లోని అశోక్ నగర్,దిల్ సుఖ్ నగర్,అమీర్ పేట్ చౌరస్తాల్లోని కోచింగ్ సెంటర్ల చుట్టూ,పదేళ్లు తిరగడానికే సరిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.నోటిఫికేషన్ ఇచ్చినట్టే ఇచ్చి వాళ్లే కోర్టులకు వెళ్లారని,పదేళ్లు ఉద్యోగార్థులను కోచింగ్ సెంటర్ల చుట్టూ తిప్పారన్నారు.ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు







చేసుకున్నారన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలో 55,163 ఉద్యోగాలను భర్తీ చేశామని,ఇందులో 11వేల టీచర్లు,15వేల పోలీసులు,6వేల మెడికల్ సిబ్బందితోపాటు ఇతర ఉద్యోగాలను భర్తీ చేసింది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ఇన్ని చేశాం కాబట్టే తాము పట్టభద్రులను ఓట్లు అడుగుతున్నామన్నారు.టీచర్ల బదిలీలు,ప్రమోషన్లను పూర్తి చేశామని,తండాలు,గూడెంలలో టీచర్లను భర్తీ చేశామన్నారు.ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు.టాటా



కంపెనీతో ఒప్పందం చేసుకుని 65 ఐటీఐలను అడ్వాన్సడ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రే చేశామని,యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని దేశంలో ఎక్కడా లేని విధంగా పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రారంభించామని,యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివరిటీని ప్రారంభించామని వివరించారు.ఇన్ని చేసిన తమకే ఓటు అడిగే హక్కు ఉందని పేర్కొన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడినా ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ లేదని,కానీ పట్టభద్రులు,రైతులు,ఉద్యోగుల తరపున శాసన మండలిలో మాట్లాడే వ్యక్తి లేకుండా పోతారని రేవంత్ రెడ్డి అన్నారు.దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యావేత్త అయిన నరేందర్ రెడ్డిని తమ పార్టీ తరఫున బరిలోకి దించామన్నారు.ఆయన మీకు,ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేస్తారన్నారు.ఈ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి శ్రీధర్ బాబు,జూపల్లి క్రిష్ణారావు,ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి,భూపతిరెడ్డి,నాగరాజు,లక్ష్మీకాంత్ రావు,మధన్ మోహన్ తదితరులున్నారు.

**ఫామ్ హౌస్ లో పడుకునే నాయకులకు విమర్శించే అర్హత లేదు**

**పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్...**

విజన్ ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత ఫామ్ హౌస్ లో పడుకునే నాయకులకు లేదని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు.ఉద్యోగాలు,నీళ్ల కోసమే తెలంగాణ సాధించుకున్న తెలంగాణలో 10 ఏళ్లలో బీఆర్ఎస్ 10 ఏళ్ల కాలంలో 50వేలకు మించి ఉద్యోగాలు భర్తీ చేయలేదని,తమ ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లో 56వేల ఉద్యోగాలను రేవంత్ భర్తీ చేశారన్నారు.ప్రతి ఖాళీని భర్తీ చేస్తామన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2 కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి ఉన్న ఉద్యోగులను పీకేసిందని,ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసిందని విమర్శించారు.రాష్ట్రానికి బీజేపీ ఎంపీలు బడ్జెట్ లో తీసుకువచ్చి సున్నా అని, దీనిపై పట్టభద్రులు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని అన్నారు.తాము జిల్లాకు 5కళాశాలలు తెచ్చామని,తెయూ ఇచ్చిందే కాంగ్రెస్ అని అన్నారు. సీఎం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారని, అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేస్తూ ముందుకు తీసుకు వెళ్తామన్నారు.నరేంద్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

**పట్టభద్రులు,ప్రభుత్వానికి వారధిగా ఉంటా**

**ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డి...**

తనను గెలిపిస్తే పట్టభద్రులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాలులో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ఎన్నికల ప్రక్రియకు ఐదు నెలల ముందు నుంచే తాను ప్రచారం ప్రారంభించానని, ఎక్కడికి వెళ్లినా ఉద్యోగులు, టీచర్లు, ఉద్యోగార్థులు రేవంత్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని, సుమారు పదేళ్ల తరువాత తాము బదిలీలు, ప్రమోషన్లకు నోచుకున్నామని టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పది రోజుల క్రితమే 2008 డీఎస్సీ నియామకాలు, జాబ్ క్యాలెండర్ పై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నానన్నారు. అలాగే ఉర్దూ కళాశాల భవన నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో కళాశాలను అందులోకి షిఫ్ట్ చేయాలని కోరారు. తనను గెలిపించాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నరేందర్ రెడ్డి అన్నారు.

# నరేందర్ రెడ్డి గెలుపుతో నిరుద్యోగులకు ధీమా.....



– ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ...

కబురు న్యూస్, శంకరపట్నం ఫిబ్రవరి 24

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి గెలిస్తే నిరుద్యోగ పట్టభద్రులకు అండగా ఉంటారని, మానకొండూర్ శాసనసభ్యుడు, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం తిమ్మాపూర్ మండలం అల్గునూరు ఎన్వీ గార్డెన్స్ లో పట్టభద్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ 27న జరగబోయే ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నరేందర్ రెడ్డి గెలిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటూ భరోసా కల్పిస్తారన్నారు. నరేందర్ రెడ్డి ఉపాధ్యాయుడుగా కొనసాగుతూ ఆల్ఫోర్స్ విద్యాసంస్థలకు అధిపతిగా ఎదిగారని, తన విద్యాసంస్థల ద్వారా ఎంతో మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాకుండా అనేక మంది విద్యార్థులను ఉన్నతస్థాయిలో రాణించేలా తీర్చిదిద్దిన ఘనత నరేందర్ రెడ్డికి దక్కుతుందన్నారు. అంతే కాకుండా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 5వేల మందికి నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చి వారి జీవితాలను చక్కదిద్దారన్నారు. కష్టపడే తత్వం గల నరేందర్ రెడ్డి కష్టం విలువ తెలుసని, నిరుద్యోగుల బాధలను అర్థం చేసుకోగలరన్నారు. నరేందర్ రెడ్డిని గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అండతో పట్టభద్రుల సమస్యలన్నింటిని తీర్చగలుగుతారని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి గుర్తు చేశారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా..

– ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ప్రచారం..

కబురు న్యూస్,శంకరపట్నం ఫిబ్రవరి 24



ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, కోరుతూ మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం మానకొండూర్ మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫేస్టో కరపత్రాలను పంచుతూ మొదటి ప్రాధాన్యత ఓటును నరేందర్ రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. నరేందర్ రెడ్డిని గెలిపించుకుంటే ఎల్లవేళలా మనకు అందుబాటులో ఉంటారని, సమస్యలను సత్వరం పరిష్కరిస్తారన్నారు. ప్రతిపక్షాల మాయమాటలకు మోసపోవద్దని, కాంగ్రెస్ పాలనలో పట్టభద్రులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కోంద్ర సురేష్, మడుపు ప్రేమ్ కుమార్, కత్తి మల్లయ్యగౌడ్, నందగిరి మల్లేశం, కోంద్ర అర్జున్, తాళ్ల కిరణ్, తాళ్ల నరేష్, రొడ్డ అంజయ్య, పిట్టల వెంకన్న, కోంద్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రామగిరి మండలంలో ఘనంగా దుద్దిళ్ళ శ్రీను బాబు జయంతి వేడుకలు

కబురు న్యూస్, రామగిరి ఫిబ్రవరి 24.




శ్రీ కోదండ రామాలయం ఆలయంలో ఈరోజు రామగిరి మండలం యువజన కాంగ్రెస్ మరియు టౌన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఐటీ భారీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రియ సోదరుడు శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుదిల్ల శీను బాబు జన్మదిన సందర్భంగా రామగిరి మండలం సెంట్రల్ కాలనీలోని,శ్రీ కోదండ రామాలయం ఆలయంలో అలాగే సాయిబాబా ఆలయంలో దుద్దిల్ల శీను బాబు పేరు మీద అర్చన పూజా కార్యక్రమం నిర్వహించి వారు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరిన రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు.

## బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం అందజేసిన ఆర్టిజన్స్ ఉద్యోగులు..

– టీవీఏసి జేఏసీ రాష్ట్ర నాయకులు ఊట్ల ప్రభుదాస్..

కబురు న్యూస్, కరీంనగర్/వీణవంక, ఫిబ్రవరి 24.



తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కరీంనగర్ లో ఆర్టిజన్స్ విద్యుత్ ఉద్యోగులు కలిసి, ఆర్టిజన్ కన్వర్షన్ చేయాలని కోరుతూ,మంత్రి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కరీంనగర్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి కి వినతి పత్రం ఇవ్వాలని అడగడం జరిగింది. సోమవారం బిజీ షెడ్యూల్ వారం రోజుల తర్వాత ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ కోసం ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్స్ విద్యుత్ ఉద్యోగులు శివ,శ్రీనివాస్,రమేష్, రాజు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో హామీలు ఇచ్చి హామీలను విస్మరించడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య.... పట్టభద్రుల అసెంబ్లీ ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి

– ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలకు అవకాశం అందించాలి... శ్రీనివాస్ రెడ్డి

కబురు న్యూస్ బాన్సువాడ ఫిబ్రవరి 24



కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు రాగానే ప్రజలకు అమలు కానీ హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించడం వెన్నతో పెట్టిన విద్య అని బాన్సువాడ నియోజకవర్గ బిజెపి పట్టభద్రుల ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన కబురు ప్రతినిధితో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే హామీని విస్మరించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయకుండానే, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, నియోజకవర్గంలో 100% రుణమాఫీ ఎక్కడ జరగలేదన్నారు. నిరుద్యోగులు గత ప్రభుత్వంపై విరక్తి చెంది కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని, రాష్ట్రంలో బిజెపి పార్టీ సుస్థిర పాలన సాగిస్తుందని, ప్రజల్లో బిజెపి పార్టీపై నమ్మకం పెరిగిందన్నారు.

### ప్రశ్నించే గొంతుకలకు అవకాశం ఇవ్వాలి...

శాసనమండలిలో ప్రభుత్వం అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలను, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రశ్నించేందుకు బిజెపి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు చిన్న మైల్ అంజిరెడ్డి, కొమురయ్యలకు తమ గొంతును వినిపించేందుకు ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బిజెపి నాయకులు కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రభుత్వ విధానాలను, అభివృద్ధిని పట్టభద్రులకు వివరించి వారిని చైతన్య పరచాలన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి... కార్పొరేషన్ చైర్మన్ కాసుల

కబురు న్యూస్ నిజామాబాద్, ఫిబ్రవరి 24

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి మద్దతుగా పట్టబద్రులు, ఉపాధ్యాయులు ఆలోచించి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. సోమవారం నిజామాబాద్ పట్టణంలోని భూమ్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి ప్రచారం నిర్వహించేందుకు ప్రణాళికబద్ధంగా పదిమంది ఓటర్లకు ఒక ఇన్చార్జిగా పనిచేస్తూ



ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోని 56వేల ఉద్యోగాలను కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, మదన్ మోహన్ రావు, తోట లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్సీ అభ్యర్థులు నరేందర్ రెడ్డి, వంగ మహేందర్ రెడ్డి,కార్పొరేషన్ మానాల



మోహన్ రెడ్డి, తాహిర్ బిన్ హుందాన్,జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు,

# మేడిపల్లి భూముల ఎంజాయ్మెంట్ సర్వే నీ అడ్డుకున్న గ్రామ రైతులు

కబురు న్యూస్, రామగిరి ఫిబ్రవరి 24

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ మేడిపల్లి శివారులోని భూములను ఎంజాయ్మెంట్ సర్వే కోసం వచ్చిన రెవెన్యూ అధికారులను రత్నాపూర్ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం మేడిపల్లి శివారులోని భూములను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడానికి నోటీసులు విడుదల చేసిన విషయం విధితమే. దీని విషయంపై పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ గారు ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం రోజు ఫీల్డ్ మీదికి వచ్చిన రెవెన్యూ అధికారులను గ్రామ రైతులందరూ కలిసి అడ్డుకున్నారు. ఈ సర్వే చేసేందుకు రైతులందరూ నిరాకరించారు ఈ



భూములను ఇచ్చే ప్రసక్తే లేదని అధికారులతో తన గోడు వెళ్లబుచ్చుకున్నారు. దీంతో అక్కడికి వచ్చిన అధికారులు తమ పై అధికారులతో ఈ విషయంపై చర్చించి అధికారుల సూచన మేరకు అక్కడి నుండి వెళ్లిపోవడం జరిగింది. అనంతరం రైతులందరూ కలిసి పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్దకు వెళ్లి అసిస్టెంట్ కలెక్టరకి వినతి పత్రం ఇచ్చి ఆర్డిఓ ని కలిసి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు కొండు లక్ష్మణ్,మండల శంకర్, భద్రపు కృష్ణమూర్తి,భద్రపు శ్రీనివాస్, బర్ల వెంకన్న, కొవ్వూరి సురేష్, గేల్లు కృష్ణ, మండల శ్రీనివాస్, జక్కుల శివకుమార్, జక్కుల సది,తోట్ల రాయమల్లు, దాసరి నరేష్, ఎరుకలి బక్కయ్య, కొప్పుల కృష్ణకర్, మేడగొండ మహేష్, మధుకర్,బెజ్జల రాజయ్య, కండె గట్టయ్య, శ్రీనివాస్ అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ప్రతి మనిషికి విద్య బలమైన ఆయుధం

– తెలంగాణరాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

– కూకట్ పల్లి ఎంఎల్ఏ అరికెపూడి గాంధీ

– మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం

కబురు న్యూస్, దినపత్రిక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా . ఫిబ్రవరి 24

విద్య బలమైన ఆయుధమనిఈ ఆయుదాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలంగాణరాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం కూకట్ పల్లి మండలంలోని ఎల్లమ్మ బండ లో అక్షయ విద్య కమ్యూనిటి లెర్నింగ్ అండ్ స్కిల్స్ ట్రైనింగ్ సెంటర్ ను గవర్నరు ప్రారంభించారు. ఈ కమ్యూనిటి హాల్ లో చిన్నారులకు అవసమైన మౌళిక వసతులు ఏర్పాటు చేసారన్నారు. చిన్న చిన్న ప్రైవెటు




ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 1 నుండి 6 వతరగతి చిన్నారులకు ప్రతిరోజు సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు ఉచితంగా ఇక్కడ చదువు చెప్పడము ఎంతో హర్షనీయమని గవకర్నర్ అన్నారు. ఈ ప్రాంతంలో ఇంటర్ డిగ్రీ చదువుకునే విద్యార్థులే వీరికి పాఠాలు చేప్పడం ఎంతో



సంతోషకరమైన విషయమన్నారు. ఈ సెంటర్ ను నిర్వహిస్తున్న అక్షయ ఫౌండేషన్ వారికి గవర్నర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ఎంఎల్ఎ అరికెపూడి గాంధీ, మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం, అక్షయ పౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక కబురు KABURU TELUGU DAILY


# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలి
- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కె బాపురావు
- కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన
- జిల్లా కలెక్టర్ పమేల సత్పత్తికి వినతి






**కబురు న్యూస్, కరీంనగర్:**
జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ పమేల సత్పత్తికి జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ.. జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని, అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కనీస సమస్యలను పరిష్కరించకుండా ఏండ్ల తరబడి జాప్యం చేస్తున్నాయన్నారు. జర్నలిస్ట్ ల ఇండ్ల స్థలాల విషయంలో సర్కారు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కారు రీవ్యూ పిటిషన్ వేసి వాదనలు చేయాలని, జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలెక్కి, లేకపోతే కొత్త విధానం ద్వారా ఇండ్లస్థలాలు ఇవ్వాలన్నారు. కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఉద్యోగుల మాదిరిగా అమలుచేయాలన్నారు. జర్నలిస్తుల కంట్రిబ్యూషన్ ను ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను అందజేయడంలో మీడియా అకాడమీ విఫలమైందని, ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసిందని, వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలుచేయాలన్నారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టాన్ని తేవాలన్నారు. మహిళా జర్నలిస్టులకు పనిచేసే కార్యాలయం నుంచి ఇంటి వరకు రాత్రి పూట రవాణా సదుపాయం కల్పించాలన్నారు. అర్హత ఉన్న చిన్న, మధ్య తరహా పత్రికలు ఎంపానెల్మెంట్లో చేర్చాలన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు వివాదంగా మారాయని వెంటనే ఆ సమస్యను పరిష్కరించి నిర్మాణ అనుమతి పత్రాలను లబ్ధిదారులకు అందజేయాలని, హుజురాబాద్ లో కేటాయించిన స్థలాలు కోర్టు వివాదంలో ఉన్నాయని అట్టి సమస్యను పరిష్కరించి పూర్తిస్థాయి అనుమతులతో జర్నలిస్టులకు అందించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సమస్యల పట్ల కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బిక్షపతి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేందుల ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కర్ణాకర్ రావు, నాయకులు చట్ల శంకర్, కొమ్ము గణేష్, అతికం రాజశేఖర్, శంకర్ రెడ్డి, గుండి కిరణ్, సుదర్శన్ రెడ్డి, సురేష్, రవీందర్, సతీష్, తిరుపతి, శ్రీనివాస్, జయేందర్, శేఖర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని గెలిపించండి

- సిపిఎం మండల కార్యదర్శి పిల్లి రవి యాదవ్



**కబురు న్యూస్, కరీంనగర్/వీణవంక, ఫిబ్రవరి 24.**
ఈనెల 27న జరిగే శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను ఓడించాలని, కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్ రెడ్డిని గెలిపించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి రవి యాదవ్ పిలుపునిచ్చారు. శాసన మండలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో లౌకిక పార్టీగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. బిజెపిని ఓడించే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని తమ పార్టీ నిర్ణయించిందన్నారు. నరేందర్ రెడ్డి గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మెజార్టీ ప్రజలకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఉత్పాదక రంగాలకు ముఖ్యంగా వ్యవసాయ రంగానికి నిధులు కోత విధించారని ఎరువుల సబ్సిడీకి 17 వేల కోట్లు కోత విధించారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే విధంగా ప్రతి సంవత్సరం నిధుల కోత పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ జిల్లాకు నిధులు తీసుకురావడంలో పూర్తిగా వైఫల్యం చెందాడన్నారు. రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమైనారని, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయకపోవడం తెలంగాణ రాష్ట్రంపై బిజెపికి ఉన్న సవతి తల్లి ప్రేమ కనిపిస్తుందన్నారు. నిజాంబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నరని, నిర్వాహనకు నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని, బీడీ పరిశ్రమకు కాపాడే చర్యలు శూన్యమన్నారు. ఆర్భాటపు మాటలు తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించడంలో బిజెపి మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు విఫలమైనరన్నారు. బిజెపి అభ్యర్థులను ఓడించి బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. జిల్లాకు ఒక సైనిక్ స్కూల్, ఒక నవోదయ పాఠశాల తీసుకురాని బండి సంజయ్ మళ్లీ ఓటు వేయమని ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. మతం వైపు భావోద్వేగాల వైపు రాజకీయాలు తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ టు కాజీపేట రైల్వే లైన్ కు నిధులు తీసుకురాలేదని జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రికి నిధులు కేటాయించలేదని, ట్రిబుల్ ఐటీ, ఐఐఎం సంస్థలు ఏర్పాటు చేయలేదన్నారు. తెలంగాణ పట్ల ముఖ్యంగా ఉత్తర తెలంగాణ పట్ల బిజెపి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. సింగరేణి బొగ్గు బ్లాకులు వేలం వేస్తుందన్నారు. బిజెపికి ఓటు ద్వారా నిరసన తెలపాలన్నారు. మతోన్మాద రాజకీయాలు చేస్తూ ప్రజల అభివృద్ధిని మర్చిపోయారన్నారు. సిపిఎం పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాలు, పట్టబద్రులు, మేధావులు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి. వి.నరేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్ లు చేస్తూ అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేసిన
- పి డి ఎస్ యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ




**కబురు న్యూస్, కరీంనగర్ ఫిబ్రవరి 24**
**ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్ మాట్లాడుతూ...................**
రాష్ట్రవ్యాప్తంగా విద్యా పూర్తిగా వ్యాపారమయమైంది. గల్లి గల్లికి మోడల్ స్కూల్స్,ఈ టెక్నో , ఫౌండేషన్ ,ఈ-టెక్నో, డిజీ, మెడిసిన్,ఐఐటి ఫౌండేషన్, సివిల్స్ లాంటి తోక పేర్లు తగిలించుకొని యదేచ్ఛగా లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడుతుంటే సంబంధిత విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఒకే పాఠశాల పేరుతో సబ్ క్యాంపస్ లను కనీస వసతులు లేకుండానే పాఠశాలలను ప్రారంభిస్తున్నారు. ఉపాధ్యాయ అర్హత లు లేకుండానే టీచర్లుగా నియమించుకుంటున్నారు. రేకుల షెడ్ల నుండి మొదలుకొని, అప్ స్టేర్ బిల్డింగ్ లలో తరగతి గదులను నిర్వహిస్తున్నారు. ఈ రెండు విద్యా నియమాలకు విరుద్ధమైనవి. విద్యార్థులకు ప్రమాదకరమైనవి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా త్రాగడానికి నీరు, వాష్ రూమ్స్, తరగతి గదులలో ఫ్యాన్లు, వెలుతురు లేకుండానే చీకటి గదుల్లో వేలాది మంది విద్యార్థులను విద్యాసంస్థల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల పట్ల నిర్లక్ష్యాన్ని వహిస్తూ నాసీ రకమైన విద్యని అందిస్తూ వేలల్లో , లక్షల్లో ఫీజులను విపరీతంగా దండుకుంటున్నారు. మరోపక్క విద్యా సంవత్సరం ముగించక ముందే పాఠశాలు, చట్ట విరుద్ధంగా కరపత్రాలు,బ్యానర్లు,యాడ్స్ తో ప్రచారం చేస్తూ టీచర్స్ ని, కొంతమంది పి ఆర్ ఓ లను ఏర్పాటు చేసుకొని అడ్మిషన్ క్యాంపియన్ చేయాలంటూ పంపిస్తున్నారు. దీనిని పి డి యస్ యూ విద్యార్థి సంఘంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తక్షణమే విద్యాశాఖ అధికారులు, పేరెంట్స్ ప్రమేయంతో ఫీజులు నిర్దేశించాలని, ప్రతి ప్రైవేట్,కార్పొరేట్ పాటశాలల్లో పేరెంట్స్ కమిటీ లు నియమించాలని, ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న పాఠశాల చర్యలు తీసుకోవాలని పి డి యస్ యూ గా విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు లోకిని రమేష్, నాయకులు పల్లవి, ,వైష్ణవి ,వెన్నెల తదితరులు పాల్గొన్నారు

# హేతువాదాన్ని అలవర్చుకోవడమే గాడ్గేబాబా కు నిజమైన నివాళి



**కబురు న్యూస్, దినపత్రిక ప్రతినిధి. ఫిబ్రవరి 24**
తెలుగు బహుజన మహాసభ - మడైల్యాండ్ ఆధ్వర్యంలో మన దేశీయ గొప్ప హేతువాది, ఇండియన్ సోక్రటీస్ సంత్ గాడ్గేబాబా 149వ జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి ముంబైలోని మడైల్యాండ్ లో ఘనంగా నిర్వహించారు. ఆరంభంలో కార్యకర్తలు దేబుజి చిత్రపటాన్ని చేతబూని జోహార్లు తెల్పారు. ఈ సందర్భంగా మహాసభ ప్రముఖులు ఆవుల చిన్నబసప్ప మహారాజ్ మాట్లాడుతూ గాడ్గే దేబుజి తన జీవితాంతం మూఢనమ్మకాలకు విరుద్ధంగా సామాన్య జనానికి అర్థమైయేటట్లు హేతువాదాన్ని ప్రచారం ప్రసారం చేశారని, రాళ్ళను రప్పలను దేవుడిగా నమ్మడం కంటే అభాగ్యులను ఆదుకోవడంలోనే పుణ్యం లభిస్తుందని, దేనిని గుడ్డిగా నమ్మకుండా ప్రతి అంశాన్ని తర్కించాలని ఎలుగెత్తి చాటిన గొప్ప హేతువాది దేబుజి. మరోవైపు శ్రమజీవులు మద్య పానీయాల నుంచి దూరం ఉంటూ, తమ పిల్లల్ని ఉన్నత చదువుల కోసం ఎనలేని కృషి చేయాలని హితబోధ చేసిన మహనీయులని చిన్నబసప్ప కొనియాడారు. ఈ జయంతిలో మహాసభ సభ్యులైన సిందాల్ డేవిడ్, సప్పొగ నాగరాజ్, బుర్ల అంజి, అడ్డకుల చౌదరి, బజ్జీల రాం, ముంబై తెలంగాణ బహుజన ఫోరం (ఎంటిబిఎఫ్) నాయకులు కున్బి నారాయణ, జంగం లింగోజీ, ఎమ్ల సాయులు, తుమ్మల మార్కు, నేరే డేనియల్, అర్. ఇజాక్, కార్మిక నేతలైన చౌవల్ రమేష్, నరపాక లక్ష్మణ్ మహారాజ్, గాయకులు భీంరత్న మాలజీ, మూలనివాసి మాలజీ పాల్గొన్నారు.

# మీస రాజయ్య జ్ఞాపకార్థం, రామాంజనేయ దేవాలయానికి 1,00,116 రూపాయల భారీ విరాళం..

- మీస రాజయ్య, (కొడుకు- కోడలు),( కూతురు- అల్లుడు)..



**కబురు న్యూస్, వీణవంక, ఫిబ్రవరి 24.**
వీణవంక మండలం మల్లారెడ్డి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాంజనేయ దేవాలయానికి మీసా రాజయ్య జ్ఞాపకార్థం (కూతురు- అల్లుడు) తీర్థల సునీత-శ్రీనివాస్,మీస లత -సాగర్ (కొడుకు-కోడలు ) మీసా రాజయ్య జ్ఞాపకార్థం సోమవారం 1,00,116/- ఒక లక్ష నూటపదహారు రూపాయలు గుడి రాముని విగ్రహానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, పల్లెర్ల కిరణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలిపించాలని ప్రచారం...



- వీణవంక మండల యూత్ కాంగ్రెస్ నాయకులు..


**కబురు న్యూస్, వీణవంక, ఫిబ్రవరి 24.**
ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఉమ్మడి కరీంనగర్- మెదక్-నిజామాబాద్-అదిలాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి ని గెలిపించాలని, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ అన్న ఆదేశాల మేరకు, సోమవారం వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామంలో ప్రచారం చేయడం జరిగింది. వీణవంక మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పోతరవేన సతీష్ కుమార్, గిరవెన మహేందర్, బోయిని విద్యాసాగర్, గణేష్ రెడ్డి,కిషోర్ గౌడ్, మడ్డి అజయ్,రాజు, అజయ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# రామగిరి మండలంలో ఘనంగా దుద్దిళ్ల శ్రీను బాబు జయంతి వేడుకలు



**కబురు న్యూస్, రామగిరి ఫిబ్రవరి 24.**
యువ నాయకులు,శ్రీపాద ట్రస్టు చైర్మన్,ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సోదరుడు శ్రీను బాబు జన్మదిన వేడుకలు మండల యువజన కాంగ్రెస్ నాయకులు బర్ల శ్రీనివాస్,మోత్కూరి అవినాష్ గౌడ్ ఆధ్వర్యంలో మండలం లోని స్థానిక ఐఎన్టీయుసీ శ్రీపాద భవనంలో ఘనంగా నిర్వహించారు,అనంతరం వివిధ గ్రామాల్లో ని ప్రభుత్వ పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్,పెన్నులు, బేగంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ చేశారు.అనంతరం యువజన నాయకులు మాట్లాడుతూ,రాబోయే రోజుల్లో 10 వ తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులు అందరూ బాగా చదువుకోవాలని,మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.అలాగే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శ్రీపాద ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామగిరి మండల నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి మాజీ జెడ్పిటిసి శీలం శ్యామ్



**కబురు న్యూస్, జమ్మికుంట ఫిబ్రవరి 24**
జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో బిజెపి బలపరిచిన గ్రాడ్యుయేట్స్ అభ్యర్థి అంజిరెడ్డి. గెలుపు కోసం ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జమ్మికుంట మాజీ జెడ్పిటిసి డాక్టర్. శ్రీరామ్ శ్యామ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ కలసి మొదటి ప్రాధాన్యత ఓటును అంజిరెడ్డికి వేయవలసిందిగా వారు కోరడం జరిగింది. ప్రశ్నించే గొంతు విధాల పరిస్థితిలో ఉన్నప్పుడే నిరుద్యోగుల సమస్య పరిష్కారం అవుతుందని వారు ఆశ భావం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులకు ఓటు వేస్తే ప్రశ్నించే శక్తి ఉండదని వారు ఎద్దేవ చేశారు. నిరుద్యోగి ఉద్యోగి సమస్యలు పరిష్కారం కావాలంటే కేవలం బిజెపి పార్టీతోనే సాధ్యమవుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యావంతుల సమస్య పరిష్కరించే వారు మాత్రమే అంజిరెడ్డి అని మాత్రమే వారు కోరారు . విద్యావంతులు వారి యొక్క విలువైన ఓటును వృధా చేసుకోవద్దని గ్రాడ్యుయేట్స్ కు సూచించడం జరిగింది. జమ్మికుంట విద్యావంతులకు ప్రశ్నించే తత్వం ఎక్కువగా ఉంటదని వారి సందర్భంగా కోరారు. బిజెపి బలపరిచిన అభ్యర్థి గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాచపల్లి వెంకటేష్,

# ‘ఛావా’.. ఆ వారసులకు దర్శకుడు క్షమాపణ



కబురు సినిమా ఫిబ్రవరి24: ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ మహరాజ్ జీవితాన్ని ఆధారంగా చేసుకొని తెరకెక్కిన చిత్రం ‘ఛావా’.లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. బాక్సాఫీస్ వద్ద వసూళ్లతో దూసుకెళ్తోన్న ఈ సినిమా విషయంలో గానోజీ, కన్హోజీ షిర్కే వారసులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈక్రమంలో దర్శకుడు వారికి క్షమాపణలు చెప్పారు.

ఈ సినిమాలో తమ పూర్వీకులను తప్పుగా చూపించారంటూ గానోజీ, కన్హోజీ షిర్కే వారసులు ఇటీవల ఆరోపణలు చేశారు. తమ పూర్వీకులకు సంబంధించిన సన్నివేశాల్లో తగిన మార్పులు చేయకపోతే ఊరుకోమని, న్యాయపోరాటానికి సిద్ధమంటూ హెచ్చరించారు. అంతేకాకుండా, రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు లక్ష్మణ్‌కు నోటీసులు పంపించారు. దీనిపై స్పందించిన ఆయన వారి కుటుంబీకులకు ఫోన్ చేసి క్షమాపణలు చెప్పారు. గానోజీ, కన్హోజీలను తప్పుగా చూపించే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని వెల్లడించారు. అందుకే వారికి సంబంధించిన వివరాలు, వారు ఏ ప్రాంతానికి చెందినవారు అనే విషయాలను సినిమాలో తాను ఎక్కడా చూపించలేదని చెప్పారు. ఈమేరకు ఆంగ్ల వెబ్‌సైట్స్‌లో వార్తలు వస్తున్నాయి.

విక్కీ కౌశల్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఔరంగజేబు పాత్రలో అక్షయ్ ఖన్నా నటించారు. శంభాజీ మహరాజ్‌కు నమ్మకస్థులైన గానోజీ, కన్హోజీ.. చివరకు ఔరంగజేబుతో చేతులు కలిపి మహరాజ్ ప్రాణాలకు హాని వాటిల్లేలా చేశారని ‘ఛావా’లో చూపించారు. దీనిని వారి వారసులు తప్పు పట్టారు. ఫిబ్రవరి 14న విడుదలైన ఈ చిత్రం అంతటా ప్రశంసలు దక్కించుకుంది. శంభాజీ మహరాజ్ పాత్రలో విక్కీ నటనను ప్రతిఒక్కరూ మెచ్చుకున్నారు.

# రావణ్ పాత్ర పోషించడానికి కారణమదే



కబురు సినిమా ఫిబ్రవరి24: రామాయణాన్ని ఆధారంగా చేసుకొని బాలీవుడ్‌లో ‘రామాయణ’ అనే భారీ బడ్జెట్ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో రావణ్ పాత్రలో కనిపించనున్నారు కన్నడ నటుడు యశ్ ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం గురించి యశ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.“ఇదొక అద్భుతమైన పాత్ర. ఈ కథలో నటించడానికి ప్రత్యేకమైన కారణాలు అంటూ ఏమీ లేవు. కేవలం ఆ పాత్రలో నటించాలనే ఉద్దేశంతోనే ఓకే చెప్పాను. రామాయణానికి సంబంధించి ఇదికాకుండా వేరే ఏదైనా పాత్ర చేస్తారా అంటే.. నేను తప్పకుండా నో అనే చెబుతా. ఒక నటుడిగా ఇది నాకు సవాలుతో కూడుకున్న పాత్ర. ఆ పాత్రలో ఎన్నో షేడ్స్ ఉంటాయి. యాక్టింగ్‌కు ఎంతో స్కోప్ ఉంటుంది” అని యశ్ చెప్పారు.రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి జంటగా నటిస్తోన్న చిత్రమిది. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. వచ్చే ఏడాదిలో ఇది విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సహ నిర్మాతగా యశ్ వ్యవహరిస్తున్నారు. ఇదే విషయం గురించి ఇటీవల ఓ చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

“డీనెగ్’ సీఈవో నమిత్ మల్హోత్రాను గతంలో కలిశా. ఆయన ‘రామాయణ’ గురించి నాతో చెప్పారు. ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తున్నా పలు కారణాల వల్ల సాధ్యపడట్లేదని చెప్పారు. భారతీయ చిత్రాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న ఆయన విజన్ నన్ను ఆకర్షించింది. దాంతో, ఈ ప్రాజెక్టుకు సహ నిర్మాతలుగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నా” అని తెలిపారు.

యశ్ ప్రస్తుతం ‘టాక్సిక్’ కోసం వర్క్ చేస్తున్నారు. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దీనిని రూపొందిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో సిద్ధమవుతోన్న ఈ సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికర విషయం తాజాగా బయటకు వచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను అలరించేలా టీమ్ దీనిని నిర్మిస్తోంది. కన్నడతోపాటు ఇంగ్లీష్‌లోనూ ఒకేసారి షూట్ చేస్తున్నారు. అన్ని భారతీయ భాషలతోపాటు పలు విదేశీ భాషల్లోనూ ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా టీమ్ ప్లాన్ చేస్తోంది. ఆ మేరకు భారీగానే ఖర్చు పెడుతోందట.

# వైల్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నాని ఊచకోత




కబురు సినిమా ఫిబ్రవరి24: నేచురల్ స్టార్ నాని బర్త్ డే సందర్భంగా హిట్ 3 మూవీ టీమ్ నాని అభిమానులకు బిగ్ అప్డేట్ ఇచ్చింది. నాని పుట్టిన రోజు పురస్కరించుకుని శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న హిట్ 3 సినిమా టీజర్?ను విడుదల చేసింది మూవీ యూనిట్. ఒక నిమిషం 44 సెకన్లతో టీజర్ కట్ చేసిన మేకర్స్.. ఇందులో నానిని వైల్డ్?గా చూపించారు. అర్జున్ సర్కార్ అనే పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నాని విశ్వరూపం చూపించినట్లు టీజర్ చూస్తే అర్థం అవుతోంది. టీజర్ ఆసాంతం వైల్డ్ పోలీస్? అధికారి క్యారెక్టర్?లో నాని రెచ్చిపోయాడు. టీజర్ ప్రారంభంలోనే నాని గురించి రావు రమేష్ ఇచ్చిన హైప్ అభిమానుల్లో క్యూరియాసిటీ పెంచేసింది.

“ఫస్ట్ డే నిన్ను చూసినప్పుడే డౌట్ వచ్చింది.. నువ్వు పోలీస్ ఆఫీసర్‌వేనా అని ఓ అమ్మాయి అనగానే.. అదే అనుకొని ఇన్నేళ్లు జనం మోసపోయారు. మీకు ఒరిజినల్ చూపిస్తా” అంటూ నాని చెప్పిన డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. తాజా టీజర్ హిట్ 3పై అంచనాలను మరింత పెంచేసింది. హిట్ సిరీస్?కు హీరో నానినే నిర్మాతగా వ్యవహరిస్తోన్న విషయం తెలిసిందే. హిట్ 1లో విశ్వక్ సేన్, హిట్ 2లో అడివి శేష ప్రధాన పాత్రల్లో నటించారు. క్రైమ్ థ్రిల్లర్, ఇన్వెస్టిగేటింగ్ నేపథ్యంలో సాగే హిట్ సిరీస్?లోని రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్?గా నిలిచాయి. ఇక, హిట్ 3లో నాని నటిస్తుండటంతో ఈ సినిమా మరింత హైప్ క్రియేట్ అయ్యింది.

తాజాగా విడుదలైన టీజర్ అంచనాలను వేరే లెవల్?కు తీసుకెళ్లిందంటున్నారు నాని ఫ్యాన్స్. హిట్ 3 మూవీకి టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించగా.. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ మిక్కీ జె మేయర్ సంగీతమందించాడు. ‘కేజీఎఫ్’ ద్వారా గుర్తింపు తెచ్చుకున్న కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి నాని సరసన హీరోయిన్?గా నటిస్తోంది. ఇప్పటికే దాదాపు షూటింగ్ కంప్లీట్ చేసుకున్న హిట్ 3 మూవీ.. మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధంగా ఉంది.


# శివంగి మూవీ టీజర్ రిలీజ్.. ఇక్కడ బ్యూటీ నేనే, బీస్ట్ నేనే



కబురు సినిమా ఫిబ్రవరి24: ఆనంది, వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలు పోషించిన విమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ‘శివంగి’ దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వంలో పి.సురేష్ బాబు నిర్మించారు. ఆదివారం ఈ మూవీ టీజర్ ను రిలీజ్ చేశారు. ఇందులో వరలక్ష్మి పోలీస్ ఆఫీసర్ గా కనిపించగా, ఆనంది హౌస్ వైఫ్ పాత్రలో నటించింది. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో ఆనందికి ఏం జరిగిందనేది ఆసక్తికరంగా టీజర్‌ను కట్ చేశారు.ఆ కేసును సాల్వ్ చేసే ఆఫీసర్ సారిక సింగ్ గా వరలక్ష్మి నటన ఇంటెన్స్ గా ఉంది. “సత్యభామ అంటే ఏదో చందమామ కథలు చెప్పే బొమ్మ అనుకున్నావేమో... ఇక్కడ బ్యూటీ నేనే, బీస్ట్ నేనే’ అని ఆనంది తన పాత్రను పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంది జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్ కీలక పాత్రల్లో నటించారు. ఎబి నేజర్ పాల్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం మార్చి 7న విడుదల కానుంది.

## అతి త్వరలో తెలుగులో సమంత మూవీ.. సంతోషంలో ఫ్యాన్స్!

కబురు సినిమా ఫిబ్రవరి24: మయోసైటీస్ వ్యాధి బారిన తర్వాత సమంత సినిమాలకు దూరమైంది. ఈ వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాత సామ్ సినిమాలకు బ్రేక్ ఇచ్చి తన ఆరోగ్యంపైనే పూర్తిగా ఫోకస్ చేసిన విషయం తెలిసిందే. ఆరోగ్యం బాగైన తర్వాత ఈ ముద్దుగుమ్మ సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ చేసింది.కానీ ఈ బ్యూటీ మాత్రం టాలీవుడ్ లో కాకుండా ఎక్కువ బాలీవుడ్ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. అంతే కాకుండా హాలీవుడ్ వైపు కన్నేసి అక్కడ ఆఫర్స్ కోసం సామ్ ట్రై చేస్తున్నట్లు సమాచారం. దీంతో అందరూ సమంత తెలుగు సినిమాలకు పూర్తిగా గుడ్ బై చెప్పింది అనే ఊహాగానాలు మొదలు అయ్యాయి.అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మ తెలుగులో సినిమాలు చేయడంపై క్లారిటీ ఇచ్చిందంటూ ఓ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతుంది. సామ్ తన ఇన్ స్టాలో అభిమానులతో చిట్ చాట్ చేస్తూ, వారితో అనేక విషయాలను షేర్ చేసుకుంది.ఈ క్రమంలోనే తమ అభిమానులు సమంతను తెలుగులో సినిమాలు చేయాలని కోరగా, తప్పకుండా, మంచి అవకాశాలు వస్తే వదులుకోకుండా, తప్పకుండా సినిమాలు చేస్తాను అని తెలిపింది. దీంతో తన ఫ్యాన్స్ ఆనందం అంతా ఇంతా కాదు.దీంతో అతి త్వరలో సమంత తెలుగులో సినిమాలు ప్రకటించే అవకాశం ఉంది, మళ్లీ మా హీరోయిన్ సమంతను తెలుగులో చూడబోతున్నాం అంటూ తన అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# బాలీవుడ్.. వివాహ వ్యవస్థను తప్పుగా చూపిస్తోంది



కబురు సినిమా ఫిబ్రవరి24: సన్యా మల్హోత్ర ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ మూవీ ‘మిసెస్’. జీ5 ఓటీటీ వేదికగా ప్రసారమవుతోన్న ఈ చిత్రాన్ని ఉద్దేశించి బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ పరోక్ష విమర్శలు చేశారు. బాలీవుడ్ చిత్రాలు వివాహ వ్యవస్థను తప్పుగా చిత్రీకరిస్తున్నాయని ఆరోపించారు. ఉమ్మడి కుటుంబాల్లో ఉండే పెద్దలను తప్పుగా చూపించడం మానాలని తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

“ఉమ్మడి కుటుంబాల్లో ఉండే పెద్దల గురించి చెప్పాలంటే.. వారు కుటుంబానికి మానసిక ధైర్యాన్ని ఇస్తుంటారు. ఎన్నో విలువైన విషయాలు నేర్పిస్తుంటారు. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు కూడా ఉన్నాయి. అందులో సందేహం లేదు. బాలీవుడ్‌లో వచ్చే ప్రేమ కథా చిత్రాలు వివాహ వ్యవస్థ గొప్పతనాన్ని తగ్గించేలా చిత్రీకరిస్తున్నారు. జీవితం చాలా చిన్నది. మన బాధ్యతలను మనం సక్రమంగా నిర్వర్తిస్తూ ముందుకు సాగిపోవాలి. గుర్తింపు కోసం ఎక్కువగా పోరాటం చేస్తే చివరకు ఒంటరిగా మిగిలిపోవాల్సి వస్తుంది” అని ఆమె రాసుకొచ్చారు.

‘గ్రేట్ ఇండియన్ కిచెన్’ చిత్రాన్ని ఆధారంగా చేసుకుని ఇప్పటికే తమిళం, తెలుగులో సినిమా వచ్చింది. తాజాగా ఇదే చిత్రాన్ని బాలీవుడ్‌లో ‘మిసెస్’ పేరుతో రీమేక్ చేశారు. హిందీ ప్రేక్షకులకు అనుగుణంగా ‘మిసెస్’ను రూపొందించారు. ఎన్నో కలలతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన మహిళకు ఎదురైన సమస్యలు ఏమిటి? కుటుంబసభ్యుల నుంచి ఆమె ఎలాంటి అనుభవాలు ఎదుర్కొంది? తన కలలను ఎలా సాకారం చేసుకుంది? అనే అంశాలతో ఈసినిమా తెరకెక్కింది. సన్యా మల్హోత్ర యాక్టింగ్‌ను సినీ ప్రియులు మెచ్చుకుంటున్నారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com